₹ 10/-


జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్



**ఆర్‌టీఎస్ చట్టంపై ఆలస్యమెందుకు? -**
**తెలంగాణ ముఖ్యమంత్రికి లోక్‌సత్తా బహిరంగ లేఖ**

సంపుటి- 8 సంచిక - 12
పక్షపత్రిక జూన్ 16-30, 2017



## కేసీఆర్, చంద్రబాబు...

## రెండు భూస్వామ్య ప్రైవేటు కంపెనీల (మూడేళ్ల) పాలన








# విద్యతోనే తప్ప ఊకదంపుడు ఉపన్యాసాలు, నినాదాలతో మార్పు రాదు : జేపీ

సంపదసృష్టి, కట్టే పన్నులు, వేసే ఓటు, ఉమ్మడి అవసరాలు, ఉమ్మడి భవిష్యత్తు గురించి ప్రజల్లో అవగాహన కలిగించే విద్యతోనే రాజకీయాల్లో, సమాజంలో మార్పు వస్తుంది తప్ప ఊకదంపుడు ఉపన్యాసాలు, నినాదాలు, పోరాటాలతో కాదని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. జ్ఞానమనే ఆయుధంతో మార్పును సాధించాలని పిలుపునిచ్చారు.

హైదరాబాద్ కొత్తపేట మోహన్‌నగర్‌లో జరిగిన '123 స్వచ్ఛ పాలిటిక్స్' ఉద్యమసంస్థ ఆవిర్భావం, తెలుగు రాష్ట్రాల ప్రతినిధుల సదస్సులో జేపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఎన్నికల్లో పోటీచేసే వ్యక్తులు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని, ఈ విషయంలో ఓటర్లలో, సమాజంలో మార్పు రావాలని జేపీ అన్నారు. ఆర్థికేతర బిల్లును 90 రోజులపాటు ఆపటం మినహా ఎటువంటి అధికారంలేని శాసనమండలిలో సభ్యత్వం కోసం కోట్లు డబ్బు ఖర్చు చేయటం దేనికి సంకేతమో అందరూ ఆలోచించాలన్నారు. కోట్ల డబ్బు గుమ్మరించి ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులుగా గెలిచినవారు సేవ చేస్తారా? అనడిగారు. ప్రజలు నిజంగా బాగుపడేందుకు కావలసిన మంచి చదువును మాత్రం పాలకులు అందించటం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం ఏటా రూ. 50,000 ఖర్చు చేస్తోందని, అయినా 8, 9 తరగతి విద్యార్థులకు కనీసస్థాయి లెక్కలు కూడా రావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి మాట్లాడుతూ, మెరుగైన వ్యవస్థ, అవినీతిరహిత సమాజం కోసం యువత ముందుకు రావాలని కోరారు. చైతన్యవంతులు రాజకీయాల్లోకి వచ్చి...పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని ఊడ్చేయాలన్నారు. మెరుగైన సమాజం కోసం స్వచ్ఛమైన రాజకీయాలు అవసరం అనే ఆలోచనతోనే '123 స్వచ్ఛ్ పాలిటిక్స్'ను ప్రారంభిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు బడే జానీ అన్నారు. సమావేశంలో కరుణాకర్‌రెడ్డి, వీరరాఘవరెడ్డి, సురేష్, దోసపాటి రాము తదితరులు పాల్గొన్నారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక జూన్ 16-30, 2017

సంపుటి - 8 సంచిక - 12

## లోపలి పేజీల్లో...


చంద్రబాబు, కేసీఆర్ రెండు భూస్వామ్య...5

మరో సర్వేది అదే హెచ్చరిక.................12

డిగ్రీ, పీజీ నిరుద్యోగుల్లో తెలుగు రాష్ట్రాలు. 13

తెరాస ప్రభుత్వం... మూడేళ్ళలో ముప్పై...14

చంద్రబాబు అమెరికా యాత్ర............. 16

ఏపీ: అప్పుల్లో ఉన్న జోరు ఆదాయంలో... 18

పుష్కరాల ఖర్చు, పనుల నాణ్యత, ......... 19

సమాచారహక్కుకు ఏదీ దిక్కు? ........... 21

ప్రభుత్వాల తీరే ప్రతిబంధకం: జేపీ........ 23

జన తెలంగాణ కోసం లోక్‌సత్తా .......... 26

సరైన పాలన లేదుగానీ, .................. 27

ఆర్‌టీఐ చట్టంపై జాప్యమెందుకు,....... 28

కార్పొరేటర్ల ఆగడాలకు అడ్డుకట్ట ..........30

పురుషోత్తపట్నం ఎత్తిపోతలను...........31

చట్టం సాధించేవరకూ పోస్టుకార్డులు.....32

అధికార పార్టీ అండతోనే విశాఖ..........33

విద్యను నాశనం చేస్తున్నది ప్రభుత్వాలే.... 34


## సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

### సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# అబద్ధాలను భరిస్తూ౦డనక్కర్లా!



యువ కాలమిస్టొకరు ఇటీవల ఒక ప్రముఖ ఆంగ్ల దినపత్రికలో ఓ కీలక సమస్యను ప్రస్తావించారు. వాస్తవాలతో సంబంధం లేకుండా, కేవలం పరిమిత అనుభవాలు, పుట్టిపెరిగిన పరిస్థితులకనుగుణంగా చాలామంది అభిప్రాయాలు, వైఖరులు ఏర్పరచుకుంటున్నారని ఆమె వాపోయారు. తమ కళ్లద్దాల నుంచి విషయాల్ని చూడటం తప్ప వాస్తవాల్ని పట్టించుకోని అలాంటివారికి నిజాలు చెప్పినా లాభం లేదన్నారు. సాంకేతికతతో అందివచ్చిన సమాచార విప్లవంలో ఇలా విస్తరిస్తున్న అబద్ధాల వెల్లువను అడ్డుకోవటం.. నిజాలు మాట్లాడుకుందామంటూ కొంతమంది ప్రయత్నపూర్వకంగా చేస్తున్న ప్రచారం వల్ల సాధ్యంకాకపోవచ్చన్నారు. పెద్దఎత్తున సాగుతున్న అబద్ధాల ప్రచారాన్ని టెలివిజన్ ఛానళ్లలో ప్రైమ్ టైమ్ చర్చలు ఇంకా రెచ్చగొడుతున్నాయని.. తీసుకున్న వైఖరి, దాని వెనక ఉన్న సంఘటన తప్పు అని తేలితే, ఆ విషయాన్ని వదిలేసి అలాంటి మరో విషయం వైపు మళ్లుతున్నారే తప్ప చాలామంది తమ మౌలిక విశ్వాసాల్ని, స్వభావాన్ని హేతుబద్ధంగా సమీక్షించుకోవటం లేదని అన్నారు. మన తల్లిదండ్రులు అన్యాయంగా ప్రవర్తిస్తున్నారనో, మన ఆర్థిక సమస్యలకు ఇతరులెవరో కారణం కాదనో హేతుబద్ధంగా ఆలోచించటం మనలో చాలామందికి కష్టంగా ఉందన్నారు.. ఓ పెద్ద సంక్షోభం స్థాయి సమస్యను ఇలా అర్థవంతంగా విశ్లేషించిన కాలమిస్ట్, పరిష్కారం దగ్గర మాత్రం తేలిపోయారు.. తమకు నచ్చిన వైఖరి తీసుకుని ఘర్షణలకు దిగుతున్న వారికి నిజాలు చెబుతూ మార్చడానికి ప్రయత్నించటం కన్నా మౌనమే మేలని, తాము బాధితులమని (అది పూర్తి భ్రమే అయినా) అనుకుంటున్నవారి పక్షాన సహానుభూతిని ప్రదర్శిస్తూ ఆ సమస్యను పరిష్కరిస్తూ ఉంటే, ఏదోకనాటికి నిజాలు బైటపడతాయని ఆమె అన్నారు. పుస్తకాలు, కళ, సినిమాలు వంటివి నిజాల దిశగా కొంత ప్రభావం చూపుతాయి. భౌతిక వాస్తవాలు బైటపడి రాజకీయాలు తారుమారవటం, కొంత రక్తపాతం వంటి వాటి తర్వాత ప్రజలు పరస్పర సహనాన్ని గౌరవిస్తారు అన్నారు. ఈలోగా మాత్రం నిజాల చెబుతూ ఆవేశపడి వాదోపవాదాలు చేయటం వృధా ప్రయాస అని తేల్చిచెప్పారు. 'ఓ కొండను భుజం మీద లేపి పక్కకు జరపొచ్చు/కానీ ఒక మనిషి ఆలోచనాతీరులో మార్పు తేవటం మాత్రం చాలా కష్టం.. ఒక్క మనిషిలోనైనా సరే' అని ఓ కాశ్మీర్ కవి చెప్పిన మాటలతో తన వ్యాసాన్ని ముగించారు.. కాలమిస్ట్ చెప్పిన సమస్య సోషల్ మీడియా యుగంలో చాలామందికి అనుభవంలోకి వస్తోంది. అబద్ధాలను తట్టుకోలేక, ఎదుర్కోలేక పలువురు స్పందించటమే మానేస్తున్నారు. అలాగే దీని గురించి చర్చ కూడా మిగతాదేశాలకంటే భారత్‌కే ఎక్కువ అవసరం. సొంత ముద్రల నుంచి చూస్తూ హేతువును, వాస్తవాలను తోసిపుచ్చటం ప్రపంచమంతా ఉందిగానీ భారత్‌లో మాత్రం అది పెనుసమస్య. అమెరికాలో నల్లజాతీయుల మీద ఉన్న వివక్ష కన్నా మన వద్ద శతాబ్దాలుగా ఉన్న కులవివక్ష ఎంతో అమానుషమైనది, ప్రమాదకరమైనది. కులతత్వాన్ని తప్పు అని మనలో చాలామంది అనుకోరు. ఇది మామూలే అని మోరల్ న్యూట్రాలిటీని ప్రదర్శిస్తారు. పేదరికం, అవిద్య, భారీ సంక్లిష్ట వైవిధ్యాలున్న దేశం కావటం వల్ల మతం, ప్రాంతం, భాష వంటివి కూడా మన మీద ఆటవిక ప్రభావం చూపుతుంటాయి. ఆ ఆలోచనాతీరును మార్చటం అంత తేలిక కాదనటంలో సందేహం లేదు. అమెరికాలాంటి దేశాల నుంచి టెక్నాలజీని దిగుమతి చేసుకున్నంత తేలిగ్గా వ్యవస్థల్ని మనదేశంలోకి దిగుమతి చేసుకోలేం అని నేను పలుమార్లు ఎన్నారైల సమావేశాల్లోనే చెప్పాను. తమకు మేలు చేసే పార్టీకి, నాయకుడికి ఓటు వేస్తేనే తమ జీవితానికి, తమ బిడ్డలకు భద్రత అని తెలిసినా అభద్రతకు లోనై పనికిమాలిన పార్టీలకు, నేతలకు ఓట్లు వేస్తూ పెనం మీద నుంచి పొయ్యిలో పడుతుండే 'ఎలీఫ్' స్థితి నుంచి మనదేశ ప్రజానీకంలో మార్పు తేవటం చాలా సంక్లిష్టమైన పోరాటమే. కానీ కాలమే పరిష్కరించాలన్నట్టు చెప్పటం నిరాశావాదం, పలాయనవాదం. ఆ దాటవేతని కచ్చితంగా తిరస్కరించాలి. మన చేతుల్లోనే ఆచరణసాధ్య పరిష్కారాలు ఉన్నాయని గుర్తించాలి. మానవ మనస్తత్వాన్ని సానుకూలంగా ప్రభావితం చేసే వ్యవస్థల్ని నిర్మించటం మొట్టమొదటి పరిష్కారం! మనిషి పుర్రెలో ఏ బుద్ధి పడుతుందో ఎవరూ చెప్పలేరు. కానీ కొన్ని రకాల పరిస్థితులలో 90శాతంమందికిపైగా మనుషులు సరైన రీతిలో ఆలోచిస్తారు. ఈ రకమైన పరిస్థితులకు ప్రోత్సాహకాలుండే వ్యవస్థల్ని నిర్మించాలి. మానవ మనస్తత్వాన్ని మూసగా భావించి ఇటువంటి వ్యవస్థల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వకపోవటం వల్లే మార్క్స్ విశ్లేషణ గతి తప్పింది. తర్వాతది విద్యాప్రమాణాలు! తర్కం, హేతుబద్ధత, విశ్లేషణ, గణితం వంటి అంశాలలో మన స్కూలు విద్యావ్యవస్థ విఫలమవటం వల్లే 2012లో 74 దేశాల మధ్య జరిగిన 'పీసా' సర్వేలో మనం అట్టడుగున 73వ స్థానంలో నిలిచాం. వైఫల్యాల్ని దిద్దుకోకుండా హాస్యాస్పదంగా పీసా సర్వే నుంచే భారత్ వైదొలిగింది. మన ఆలోచనాశక్తిలో లోపానికి మూలాలు మన విద్యావిధానంలో ఉన్నాయి. దేశంలోని 80శాతం మందికి పనికిమాలిన చదువు అందిస్తూ.. వారికి నైపుణ్యాలు లేవు, సరైన సామాజిక విశ్లేషణాశక్తి లేదు అని నిందిస్తే ఎలా! విత్తు ముందా, చెట్టు ముందా సందేహం వదిలి.. వ్యవస్థల నిర్మాణాన్ని, అందరికీ నాణ్యమైన విద్యను అందించటాన్ని మనదేశంలో ఏకకాలంలో కొనసాగించాలి. దీంతోపాటు, కుల, మత, ప్రాంత, భాష, పార్టీలకతీతంగా సామరస్యాన్ని పెంచుతూ సామాజిక సంస్కరణోద్యమాల్ని పెద్దఎత్తున సాగించాలి. పటిష్ట వ్యవస్థలు, నాణ్యమైన విద్య, సామాజిక సామరస్య ఉద్యమాలు.. కొన్ని తక్షణ చర్యలతోపాటు ఈ మూడూ కలసికట్టుగా సాగితేనే సమాచార యుగంలో అబద్ధాల వెల్లువను అరికట్టగలం. అమెరికా వంటి దేశాల్లో వ్యవస్థలు మనకంటే మెరుగ్గా ఉన్నా.. ప్రపంచీకరణకు తగ్గ వ్యవస్థల్లేక వాళ్లూ గందరగోళంలోనే ఉన్నారు. అపరిపక్వ ప్రపంచీకరణ వ్యవస్థలకవల్లే వాతావరణ ఒప్పందం, ఇస్లాం తీవ్రవాదం వంటి అంశాలపై యుగసంక్షోభాన్ని పెంచేలా వ్యవహరిస్తున్నారు. ఇల్లు చక్కదిద్దుకుంటూనే మెరుగైన ప్రపంచీకరణ వ్యవస్థల్ని మనదేశం అందుకోవాల్సింది.. పచ్చికాయను మాగబెడుతున్నామనుకోనక్కర్లా. చెట్టుకు కాయలుకాయటానికి, అవి మనం కోసుకుని తినే పండ్లుగా మారటానికి కూడా మానవ ప్రయత్నం అవసరం. అలాంటి నిజమైన నాయకత్వ కృషితోనే.. మళ్లీ కొన్ని తరాలు నష్టపోకుండా ఈ యువతరంలోనే భారత్‌ను ఉన్నతస్థాయికి తీసుకెళ్లగలం.

మీ



కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ప్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ *నం: 62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# చంద్రబాబు, కేసీఆర్...
# రెండు భూస్వామ్య ప్రైవేటు కంపెనీల (మూడేళ్ల) పాలన



రాష్ట్ర విభజన అనివార్యమై తెలంగాణ, పరిశేష ఆంధ్రప్రదేశ్ ఏర్పడుతున్నప్పుడు ఇష్టంలేనివారు చేయవలసిన పని ఏమిటి?.. ఆ విభజనను ఓ మేలిమార్పునకు అవకాశంగా మలచుకోవడం!

కానీ రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, కె.చంద్రశేఖరరావుల మూడేళ్ల పాలన చూశాక.. రాష్ట్ర విభజన కోసం ఎంతో ఇష్టంగా గొంతు చించుకుని రోడ్లెక్కి దూషణలకు, దాడులకు పాల్పడ్డవారు సైతం విభజనను అలా ఓ అవకాశంగా మలచుకోలేకపోయారని సుస్పష్టంగా కనిపిస్తోంది.

కేవలం రాజకీయ నాయకుల చేత, రాజకీయ నాయకుల కోసం.. మాత్రమే తెలంగాణ ఏర్పడిందని, ప్రజలు వారి చేతుల్లో పనిముట్లలా మాత్రమే ఉపయోగపడ్డారని రుజువు చేస్తున్న వాస్తవమిది!

ప్రత్యేక తెలంగాణ ఉద్యమంగనక ప్రజల చైతన్యం, అవగాహన నుంచే వచ్చినట్టయితే పరిణామాలు కచ్చితంగా ఇలా ఉండేవి కావు. కొంతయినా వ్యవస్థీకృత మార్పు కనిపించేది.

ప్రజల కంటే ముందు నడుస్తూ మార్పు తేవటం కూడా సమున్నత నాయకత్వ లక్షణమేకానీ, ఆ దిశగా ప్రజల్ని ఆలోచింప చేస్తూ చైతన్యపరిచే ప్రయత్నం చేయకపోవటం, ప్రజలు ఆలోచించటమే ప్రమాదకరమనే రీతిలో ఉద్రేకాలని పెంచి పోషించే ధోరణుల వల్ల.. ఈ సందర్భంలోని నాయకత్వం అలాంటి నిర్మాణాత్మకమైనది కాదని తేల్చి చెప్పుకోవచ్చు. హేతుబద్ధతకు, చర్చకు ఆస్కారమివ్వని అలాంటి నాయకత్వాన్ని అనుసరించటం అనివార్యంగా వైఫల్యానికే దారితీస్తుందనే హెచ్చరికను జారీ చేయాల్సిన శక్తులు కూడా తమ సొంత ప్రయోజనాలను దాటి ఆలోచించకపోవటం.. ప్రజాందోళనల తర్వాత ఏర్పడినా కూడా తెలంగాణలో యధాతథ పరిస్థితిని స్థిరపరచింది.

తమలో చాలామందికి ఇష్టంలేని రాష్ట్ర విభజనను అవతలి రాష్ట్రంలో చాలామంది ఇష్టపడటానికి తాము ఓటు వేసి ఎన్నుకున్న నాయకులే కారణమని తెలిసినా స్పందించే చైతన్యస్థాయి పరిశేష ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో లోపించటం.. రాష్ట్రంలో యధాతథ రాజకీయానికి ఢోకా లేకుండా చేసింది.

రాష్ట్ర విభజనకు తామే కర్త, క్రియలు కాబట్టి తమ సాంప్రదాయ రాజకీయాన్నే కొత్త రాష్ట్రాల నెత్తిన రుద్ది ప్రైవేటు కంపెనీల్లా కేసీఆర్, చంద్రబాబు పాలన సాగిస్తున్నారు. అందుకే మూడేళ్ల పాలన తర్వాత కూడా.. రాష్ట్ర విభజన సమయంలో (రాజకీయంగా పరిణతితో వ్యక్తీకరించలేకపోయినా) ప్రజల గుండెల్లో నెలకొన్న ఆకాంక్షలు నెరవేరకుండా పోయాయి. నెరవేరేందుకు తగిన ప్రయత్నాలు కూడా కనుచూపు మేరలో కనిపించటం లేదు.

రాష్ట్ర విభజన, విలీనం అనేవి మౌలికాంశాలు కావు గానీ.. వాటిని ఏకైక ఎజెండాగా మార్చినప్పుడు మాత్రం ఈ చర్చ ఉండితీరాలి. అప్పుడే తెలంగాణ ఏర్పాటు సర్వరోగ నివారిణి, విడిపోయిన రోజు చీకటిరోజు అంటూ రాజకీయ లబ్ధి కోసం చేసే తప్పుడు, రెచ్చగొట్టే ప్రచారాల ఉచ్చు నుంచి రెండు రాష్ట్రాల ప్రజలూ బైటపడగలుగుతారు. మూడేళ్లు దాటాకైనా కాస్త అవగాహనతో, అప్రమత్తతతో.. పాలకుల ప్రయోజనాల కోసం కాకుండా తమ ప్రయోజనాలు ప్రాతిపదికగా వ్యవహరించగలుగుతారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో గత మూడేళ్ల పాలన కేసీఆర్, చంద్రబాబు అనే రెండు భూస్వామ్య ప్రైవేటు కంపెనీల కార్యకలాపాల్లా ఉన్నాయి తప్ప, రెండు కొత్త రాష్ట్రాల్లో ప్రజల జీవితాల్ని బాగుచేసే ప్రజాస్వామిక నాయకత్వ కృషిలా లేదు.

ముఖ్యమంత్రి అంటే ఓ గంభీరమైన ఆలోచనాపరుడిలా కాకుండా.. కంపెనీ సీఈవో (చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి)లాగా వ్యవహరిస్తేనే పెట్టుబడులను ఆకర్షించ గలరు, ఉపాధిని సృష్టించగలరు, మారుతున్న సమాజ అవసరాలకు తగ్గట్టు కొత్త ఆలోచనలు చేయగలరు, స్వేచ్ఛా వాణిజ్య ప్రపంచంలో ఇదే సరైన పరిపాలనా నమూనా అని వాదించవచ్చు. పెద్ద ప్రొటోకాల్స్ లేకుండా ఎప్పటికప్పుడు అవసరాన్ని బట్టి ఏకకుటుంబ కంపెనీ పెద్దలా నిర్ణయం తీసుకోవటంలో, నిధులు వెచ్చించటంలో తప్పేముందని ప్రశ్నించవచ్చు.. సరే, ఒప్పుకుందాం! జనాభాలో అత్యధికులుగా ఉన్న యూత్‌కి ఈ సీఈవో భాషలో, కుటుంబ కంపెనీ వ్యవహారశైలిలో చెబితే తేలిగ్గా అవుతుంది కాబట్టి ఒప్పుకోవటానికి మనకూ అభ్యంతరం ఉండాల్సిన పనిలేదు. కానీ ఇక్కడే పెద్ద తిరకాసు ఉంది.

ముఖ్యమంత్రి మెరుగైన పనితీరును ప్రదర్శించటానికి కంపెనీ సీఈవోలాగానో, ఇంఛార్జిలాగానో, ఎంటర్‌ప్రెన్యూర్‌లాగానో, మరోరకంగానో వ్యవహరిస్తే, సాంకేతిక నిపుణుడి అవతారమెత్తితే మనకేమీ అభ్యంతరం ఉండనక్కర్లేదు. కానీ ఆ కంపెనీని ప్రజలందరి భాగస్వామ్యమున్న, ప్రజలందరినీ కుటుంబ సభ్యులుగా భావించే పబ్లిక్ కంపెనీలా కాకుండా.. తనకు, తన కుటుంబానికి, తన బంధుమిత్రపరివారానికి మాత్రమే పరిమితమైన ప్రైవేటు (లిమిటెడ్) కంపెనీగా నడపటం దగ్గరే వస్తుంది సమస్య.

అదే తెలుగు రాష్ట్రాల్లో తిరకాసు! చంద్రబాబు, కేసీఆర్ కంపెనీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలందరూ భాగస్వాములు కారు. వారి కుటుంబ సభ్యులకు, వారి పార్టీల్లో చేరి వారి అడుగులకు మడుగులత్తేవారికి, వారికి విరాళాలిచ్చేవారికి, వారికి మద్దతిచ్చి వారి గురించి ప్రచారం చేసేవారికి మాత్రమే షేర్లు, హోదాలు ఉంటాయి. ఓట్లు వేసేవారికి కూడా పెద్దగా ప్రాధాన్యం ఉండదు. తాయిలాలు, తాత్కాలిక పథకాలు మాత్రమే అందుతాయి. కార్యకర్తలకు జన్మభూమి కమిటీలు వంటివి ఏర్పాటు చేసి కాస్త ఎక్స్‌ట్రా ప్రాధాన్యత ఇచ్చేందుకు ప్రయత్నిస్తారు.

అంటే, అవి చంద్రబాబు, కేసీఆర్ అనే ప్రైవేటు కంపెనీలు తప్ప, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అనే పబ్లిక్ కంపెనీలు కావు! ఆ రెండు భూస్వామ్య ప్రైవేటు కంపెనీలు.. తెదేపా, తెరాస అనే వాహనాలను ఉపయోగించుకుంటూ తమ సొంత ప్రయోజనాల చుట్టూనే పనిచేస్తుంటాయి.

ఉభయ తెలుగు రాష్ట్రాలూ వారి వ్యాపార క్షేత్రాలు మాత్రమే. ప్రజలేమో పెద్దమార్కెట్‌గా ఉపయోగపడుతుంటారు.

అందుకే రాష్ట్రాల్లో ప్రజల ఆదాయం ఎలా ఉన్నా.. తెదేపా, తెరాసల ద్వారా బాబు, కేసీఆర్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టేవారి షేర్లు తరచూ అమాంతం పెరిగిపోతుంటాయి.

ప్రజలు తమ కంపెనీల ఉత్పత్తులు కొనాలంటే ఆఫర్లు ఇస్తుండాలి కదా.. అలా రుణమాఫీలని, కులవృత్తుల పునరుజ్జీవనమని, గొర్రెలు, బర్రెలని, రిజర్వేషన్లని, ఇసుక ఫ్రీ అని, దేవతలు నివసించే రాజధాని నిర్మాణమని, ప్రత్యేక ప్యాకేజీ అని, కానుకలని ఊదర గొడుతుంటారు. ఈవెంట్ మేనేజ్‌మెంట్లు చేస్తూ, మీడియాని కంట్రోల్ చేస్తూ బాకాలూదుకుంటుంటారు.

## ప్రజల కంపెనీలైతే ముందు ఇవ్వాల్సిందేమిటి?

నిజంగా రాష్ట్ర ప్రజలు కూడా కేసీఆర్, చంద్రబాబు అండ్ కోలలో భాగమైతే.. ముందు ఏమిచ్చుండేవాళ్లు? అందుకోసం.. వాళ్ల పిల్లల్నే చూడండి. మంచి ఆరోగ్యం, చదువు వాళ్లకి ఇచ్చారు. విదేశాలకు పంపించి మరీ ఉన్నత చదువులు చదివించారు. అలా తెలుగు ప్రజల బిడ్డలందరికీ ఇచ్చి ఉండేవాళ్లు.

కానీ ఈ మూడేళ్లలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో చదువు, ఆరోగ్యం ఎలా ఉందయ్యా?.. ప్రాథమిక స్థాయిలో కనీస పరిజ్ఞానం లేని చదువులుండటం వల్ల నీతి ఆయోగ్ ఆంధ్రప్రదేశ్‌కి 17వ ర్యాంకు ఇస్తే, తెలంగాణను రెడ్‌జోన్‌లో పెట్టింది. ఈ రాష్ట్రాల్లో ఐదవ తరగతి చదువుతున్నవారు తమ పేరు కూడా రాసుకోలేని దుస్థితిలో ఉన్నారని 'అసర్' సర్వే తాజాగా కూడా చెప్పింది. ప్రభుత్వ పాఠశాల, ఎయిడెడ్ పాఠశాలలో మళ్లీ ప్రతి విద్యార్థి మీదా ఏటా రూ. 40,000-50,000 దాకా ఖర్చు పెడుతున్నా ఫలితాలు ఇంత అధ్వాన్నంగా

### రెండు రాజధానులైనా, ఒకే పాత రాజకీయం

ఆర్థిక సంస్కరణల ద్వారా కొంతమంది ఆదాయాలు పెంచటం, పెరిగిన పన్నుల డబ్బుతో సంక్షేమం పేరుతో పేదలకు తాయిలాలు, ఉచితాలు ఇవ్వటమే తన రాజకీయమని ఈ ఏడాది నవనిర్మాణ దీక్షలో కూడా చంద్రబాబు స్పష్టంగా చెప్పారు. అంటే.. పేదరికం ఎప్పటికీ తొలగిపోని, కుల, ఆర్థిక అంతరాలు పెరుగుతూ ప్రజాస్వామ్యం ఎన్నటికీ వికసించని రాజకీయం, పాలనే చంద్రబాబు నమూనా. సంక్షేమ పథకాలు, తాయిలాల్లో కొంత లోకల్ వెరైటీలు, ఫ్లేవర్, భూస్వామ్య వ్యక్తిత్వ ధోరణులు మారొచ్చుగానీ.. కేసీఆర్ చేస్తున్నదీ అదే తరహా పాలిటిక్స్. రాజకీయం మారి అందరికీ ఎదిగే అవకాశాలున్న కొత్త రాజకీయం రాకపోవటం వల్ల.. రెండు రాజధానులైనా, తెలుగువారికి పాత పాలనే కొనసాగుతోంది.

## కష్టపడుతున్నా, ఖర్చు జరుగుతున్నా సుస్థిర ఫలితాలు లేవు

చంద్రబాబు చాలా కష్టపడి పనిచేస్తున్నారు, విద్యుత్తు మిగులును సాధించారు, సాంకేతిక పరిజ్ఞానంతో పారదర్శకతను, పనుల్లో వేగాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నారనటంలో సందేహం లేదు. ప్రస్తుతం వ్యక్తిగత అవినీతికి పాల్పడుతున్నట్టు ఆధారాలు కూడా లేవు. కేంద్రం నుంచి మౌలిక వసతుల ప్రాజెక్టులను వేగంగా సాధిస్తూ పెట్టుబడులు ఆకర్షించటానికి కూడా చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నారు. కేసీఆర్ కూడా ఇవన్నీ చేస్తున్నారు. అదనంగా మిషన్ కాకతీయ, భగీరథ వంటి మంచి కార్యక్రమాల్ని కూడా చేపట్టారు. కేంద్రం నుంచి రాష్ట్రాలు మరిన్ని అధికారాలు కావాలని ఇద్దరు ముఖ్యమంత్రులూ సహేతుకంగానే కోరుతున్నారు. కానీ కేసీఆర్, చంద్రబాబు ఇద్దరూ అధికారాన్ని కేంద్రీకరించి వ్యవస్థలు, స్థానిక స్వయంపాలన బలపడకుండా చేస్తున్నారు. రాజధానులు హైదరాబాద్, అమరావతి చుట్టూనే అంతా కేంద్రీకరిస్తున్నారు. ప్రభుత్వాధికారులకు 42-43శాతం మేర భారీగా జీతాలు పెంచి (కావాలంటే మరో విడత పెంచటానికి కూడా సిద్ధమని చంద్రబాబు తాజా నవనిర్మాణ దీక్షలో ప్రకటించారు) వారి చేత పనిచేయించే పౌర సేవల చట్టం వంటి వ్యవస్థల్ని నిర్మించకుండా, ప్రభుత్వ కార్యాలయాల్లో జరగాల్సిన పనులు చేస్తూ ఎమ్మెల్యేలు ప్రభుత్వంలో భాగంగా మారుతుండటాన్ని ప్రోత్సహిస్తూ, రాజకీయ పునరేకీకరణ పేరుతో యధేచ్ఛగా ఫిరాయింపులకు పెంచి పోషిస్తూ ప్రతిపక్షమే లేకుండా ప్రాంతీయ చక్రవర్తుల్లా అధికారాన్ని చెలాయించాలని భావిస్తున్నారు.

కేవలం వచ్చే ఎన్నికల దృష్టితో డబ్బు సహా అన్ని హంగుల్నీ సిద్ధం చేసుకుంటున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నవంబర్ 8, 2016న పెద్ద నోట్ల రద్దును ఆకస్మికంగా ప్రకటించినా, మాయావతిలా దొరకకుండా తెలుగు రాష్ట్రాల పాలకులు ముందే జాగ్రత్త పడ్డారని వినికిడి. ఈ ఆరోపణకు సాక్ష్యాల్లేవుగానీ, వారు పార్టీ తరపున నిర్వహిస్తున్న కార్యక్రమాలకు, ఎన్నికలకు వెదజల్లుతున్న డబ్బును చూస్తే తప్పుడు విమర్శ అని కొట్టిపారేయలేం. వంశపారంపర్య రాజకీయాలతోపాటు కులతత్వాన్ని, మతఛాందస విశ్వాసాల్ని, వాస్తు వంటి మూఢనమ్మకాల్ని, మనోడే తరహా ఆశ్రిత పక్షపాతాన్ని ప్రోత్సహిస్తున్నారు. చంద్రబాబు కంటే భూస్వామ్య మనస్తత్వంపాలు ఎక్కువ ఉండటంతో.. ఛాందస భావాల్ని, పెత్తందారీ ధోరణుల్ని కేసీఆర్ కాస్తంత అదనంగా ప్రదర్శిస్తున్నారు. వెనుకబడినవారంటే వెనుకబడిన కులాలేనని బరితెగించి వాదిస్తూ గ్రామీణ ప్రాంతాలలో కుల రాజకీయాలకు ఆజ్యం పోసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ రాజకీయ సంకల్ప వైఫల్యాల వల్ల బాబు, కేసీఆర్ల దృష్టి ప్రైవేటు భూస్వామ్య కంపెనీల స్థాయి లక్ష్యాలు దాటి వెళ్లటం లేదు. డబ్బు ఖర్చవుతున్నా.. తాత్కాలికంగా బండి నడుస్తోంది తప్ప ప్రజలఅవసరాలు తీరటం లేదు, దీర్ఘకాల ఫలితాలు రావటం లేదు.

ఉన్నాయి. ఈ డబ్బంతా ఎటు పోతోందో లెక్క కూడా వేసేంత తీరికలేదు ఈ పాలకులకు. ఇక ఆరోగ్యంలో దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి వేసిన 'ఆరోగ్యశ్రీ' చిట్కానే అటూఇటూ చేసి ప్రయివేటు, కార్పొరేటు వైద్యశాలలకు లాభం చేకూర్చే విధానాన్నే పాలకులు కొనసాగిస్తున్నారు. దీనివల్ల వైద్యఖర్చుల వల్ల అప్పుల పాలవుతున్న వారి సంఖ్యలో ఇంకా దేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కొనసాగుతున్నాయి. తెలంగాణ గ్రామీణ ప్రాంతంలో వైద్య ఖర్చు రూ.21683కాగా, పట్టణాల్లో రూ.22584 ఖర్చవుతోంది. అదే ఏపీలో ఆ వ్యయం రూ.15411, రూ.33671గా ఉంది. తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాల్లో ప్రతి వెయ్యిమందిలో 505 మంది అప్పుల ద్వారా వైద్యానికి కావలసిన డబ్బుని సమకూర్చుకుంటున్నారు. పట్టణ ప్రాంతాల్లో అప్పులు చేసేవారి సంఖ్య వెయ్యికి 236గా ఉంది. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ ప్రాంతంలో ప్రతి వెయ్యిమందిలో 520మంది అప్పులు చేసి వైద్యం చేయించుకుంటున్నారు. పట్టణ ప్రాంతాల్లో అప్పులు చేస్తున్నవారు 347 మంది. ఇవన్నీ అధికారిక లెక్కలే. సంక్షేమానికి రూ.40,000 కోట్ల దాకా ఖర్చు చేస్తున్నామంటూ డబ్బాలు కొట్టుకుంటున్న తెలుగు రాష్ట్రాల పాలకులు.. సరైన వైద్యాన్ని అందించకుండా, విచ్చలవిడి మద్యం అమ్మకాల్ని ప్రోత్సహించటం ద్వారా నిజానికి పేదరికాన్ని పెంచి పోషిస్తున్నారు. పేదరిక నిర్మూలన చేయలేని ప్రమాదకర సంక్షేమ, తాయిలాల విధానాల నమూనానే ఏమాత్రం తేడా లేకుండా రెండు రాష్ట్రాల పాలకులూ అనుసరిస్తున్నారు.

నాణ్యమైన విద్య లేకపోవటంతో కొరవడిన ఉపాధి నైపుణ్యాలను పెంచి, ఉపాధిని సృష్టించేందుకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రయత్నం చేస్తున్నా, జనం తమ కంపెనీ మార్కెట్ని దాటి పోకుండా చూసుకోవాలనే ఆత్రంతో కొత్త ఆలోచనలు చేయకపోవటం, చిన్న పట్టణాల చుట్టూ వికేంద్రీకరణ విధానాలు, చిన్న, మధ్యతరహా వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటు, సహకార వ్యవస్థ బలోపేతం, మార్కెట్ సంస్కరణలు వంటివి అమలుచేయకపోవటం వల్ల ఉపాధి అవకాశాల సృష్టిలో దారుణంగా దెబ్బతిన్నాయి. పారిశ్రామిక రాయితీలు అందించే ప్రత్యేక హోదాను సాధించేందుకు చంద్రబాబు ఆసక్తి కనబరచకపోవటం, హోదా ఏపీ మొత్తానికీ ఇవ్వలేకపోతే రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణ సహా వెనకబడిన జిల్లాలకు సాధిద్దామన్న లోక్‌సత్తా ఫార్ములా పట్ల

## జేపీ 100 జిల్లాల ఐడియా తీసుకున్న మోదీ ప్రభుత్వం

రాష్ట్ర విభజన సమయంలో ఏపీ ఆర్థిక భవిష్యత్తుకు భరోసా కల్పించటం కోసం ప్రత్యేక తరగతి హోదా కల్పించాలని మొట్టమొదట ప్రతిపాదించింది లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణేనన్న సంగతి తెలిసిందే. అందుకు పార్లమెంటులో యూపీయే, ఎన్డీయే కలిసి రావటంతో అప్పటి ప్రధాని పార్లమెంటులో హామీ ఇచ్చారు. కానీ 2014 ఎన్నికల తర్వాత ఏపీకి ప్రత్యేకహోదా కోసం ఇతర రాష్ట్రాలను ఒప్పించటంలో బీజేపీ, చంద్రబాబు ప్రభుత్వం చొరవ చూపకపోవటంతో హోదా మరుగునపడిపోయింది. దీంతో.. ఆంధ్రప్రదేశ్ మొత్తానికీ ప్రత్యేక హోదా ఇవ్వటం సాధ్యం కాకపోతే, రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణ సహా దేశవ్యాప్తంగా 100 బాగా వెనకబడిన జిల్లాలకు హోదా ఇవ్వాలని, దీనికి అన్ని రాష్ట్రాలూ అంగీకరిస్తాయని ఆ తర్వాత జేపీ సూచించారు. లోక్‌సత్తా ప్రత్యామ్నాయ పరిష్కారాన్ని నీతి ఆయోగ్‌కు కూడా పంపారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆసక్తి చూపలేదుగానీ, మోదీ ప్రభుత్వం ఈ 100 వెనకబడిన జిల్లాల ఫార్ములాను సూత్రప్రాయంగా తీసుకుని అభివృద్ధి ప్రణాళికను రూపొందిస్తోంది. వెనకబడిన జిల్లాల అభివృద్ధికి నిధుల కేటాయింపు కార్యక్రమాలు ఎప్పటినుంచో ఉన్నప్పటికీ.. వెనకబడిన రాష్ట్రాలకు ప్రత్యేకహోదాలాగా 100 అత్యంత వెనకబడిన జిల్లాలకు ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టాలని మోదీ భావిస్తున్నారు. అయితే జేపీ ఐడియాలోని విధివిధానాలు, వికేంద్రీకరణ పద్ధతులు వంటి వాటి మీద దృష్టి పెట్టకుండా, బిగ్ ఐడియా–బిగ్ పబ్లిసిటీ తరహాలోనే మోదీ సర్కారు వ్యవహరిస్తున్నట్టు కనిపిస్తోందని లోక్‌సత్తా నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కేసీఆర్ కూడా ఆసక్తికనబరచకపోవటం రెండు రాష్ట్రాలలో ఉపాధి, అభివృద్ధి అవకాశాలను ప్రభావితం చేశాయి (లోక్‌సత్తా 100 వెనకబడిన జిల్లాల అభివృద్ధి ఫార్ములాను మోదీ ప్రభుత్వం మాత్రం సూత్రప్రాయంగా పరిగణలోకి తీసుకుంది). నాణ్యమైన విద్య, ఉపాధి అందించకుండా కొద్దిమందికి కొద్దిపాటి ఉపశమనాన్నిచ్చే రిజర్వేషన్లు, కులాల చుట్టూ ఇద్దరు పాలకులూ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారు.

### 'ప్రైవేటు' కాబట్టే వికేంద్రీకరణ మేనేజ్‌మెంట్ సూత్రాన్ని ప్రజలకు వర్తింపచేయటం లేదు

ఇక కంపెనీ పనితీరు బాగుండాలంటే, అధికార వికేంద్రీకరణ చేయాలనేది ఆధునిక మేనేజ్‌మెంట్ సూత్రం! దిగువస్థాయి వారికి అధికారాలు, నిధులు ఇచ్చి ఫలితాలు చూపించమని కంపెనీలు అడుగుతుంటాయి. చాలామంది సీఈవోలూ ఇదే రకంగా పనిచేస్తుంటారు. కేసీఆర్, బాబు ప్రభుత్వాలు ప్రజా కంపెనీలయితే.. ఈ లెక్కన అధికారాన్ని ప్రజలకు వికేంద్రీకరించాలి. కానీ పొరపాటున కూడా ఆ పని జరగకుండా ఇద్దరు ముఖ్యమంత్రులూ పిడికిలి బిగించేశారు. అధికారం వారికి, వారి అనుంగులకే పరిమితం. ఆ పరిధి దాటి ప్రజల్లోకి పినరంత కూడా వికేంద్రీకరించకుండా ప్రైవేటు కంపెనీకి నిఖార్సయిన నిదర్శనంగా నిలిచారు. అభివృద్ధిని, పాలనను రాజధానుల చుట్టూనే కట్టడి చేశారు. అమరావతిలోని బాబు నివాసంలో, హైదరాబాద్‌లోని కేసీఆర్ దర్బారులోనే అధికారమంతా కేంద్రీకృతమై ఉందని వారి వందిమాగధులు ఓ ఘనకార్యంలా చెప్పుకుంటుంటారు.

ఈ కేంద్రీకృత ధోరణులతో.. ఇద్దరు ముఖ్యమంత్రులూ స్థానిక ప్రభుత్వాలకు చేరాల్సిన నిధుల్ని మళ్లిస్తున్నారు. వ్యక్తిగత దానాలకు దుర్వినియోగం చేస్తున్నారు. తెలంగాణలో ఎంతో ప్రాముఖ్యత గల గ్రామజ్యోతి పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం నిర్వీర్యం చేయగా, ఏపీలో జన్మభూమి కమిటీల పేరుతో పార్టీ కార్యకర్తలతో ఎన్నికైన గ్రామపంచాయతీల వ్యవస్థను బాబు ప్రభుత్వం నీరుగారుస్తోంది. స్థానిక స్వయంపాలన లేకపోవటంతో ప్రజలకు రోజువారీ సేవలు అధ్వాన్నంగా తయారై అవినీతి, అసమర్థ వ్యవస్థ రెండు రాష్ట్రాలలో యధావిధిగా పెరుగుతూ పోతోంది. డబ్బు, సౌకర్యాలున్న కొద్దిమందిని మినహాయిస్తే, మిగిలినవారు ఎండ, వానల చుట్టూనే బతకాల్సి ఉంటుంది. పాలనకు, తమ ఓటుకు మధ్య సంబంధం అర్థంకాక ప్రజలలో నిరాశానిస్పృహలు, అయినకాడికి ఓటును అమ్ముకుని దండుకునే ధోరణులు కొనసాగుతున్నాయి.

### అవినీతిపై మాటలే, చట్టబద్ధ పాలన గాలివాటమే

తమ కంపెనీల ఆదాయం కోసం, డిమాండ్ కోసం ప్రభుత్వాధికారుల్ని, ప్రభుత్వ కార్యాలయాల్ని, పోలీసు వ్యవస్థని వాడుకోవటమనే రాజ్యాంగ విరుద్ధ కార్యక్రమాన్ని రెండు ప్రభుత్వాలూ ఉద్దేశపూర్వకంగానే కొనసాగిస్తున్నాయి.

అవినీతిలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండోస్థానంలో ఉందని ఇటీవల ఓ సర్వే తెలిపింది. తెలంగాణ రాజధానిలోనే రూ.వేల కోట్ల భూముల రిజిస్ట్రేషన్ కుంభకోణం జరుగుతుంటే, 2017లో మే నెలాఖరు వరకు హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలన్నిటిలో కలిపి కేవలం నాలుగు కేసులు నమోదు చేసి ఏసీబీ కొత్త రికార్డు సృష్టించింది. సర్కారీ అధికారులను ఉపయోగించుకుంటూ కార్పొరేటర్లు ఎలా చెలరేగిపోతున్నారో హైదరాబాద్ సిటీలో మధ్యతరగతి, సామాన్యవర్గాల ప్రజలనడిగితే చెబుతారు. కార్పొరేటర్లు,

## కేసీఆర్, అమిత్‌షా, మోదీల సొమ్ముకాదది!

తెలంగాణ ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ఎక్కువ నిధులనే ఇస్తోందని ఏదో బిచ్చమేస్తున్నట్టు బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా మాట్లాడటంపై ముఖ్యమంత్రి కేసీఆర్ విరుచుకుపడటంతో రాజుకున్న రాజకీయ అగ్గి.. నివురుగప్పినట్టు కొనసాగుతూనే ఉంది. కేంద్రం ఇచ్చిన దానికన్నా కేంద్రానికి తెలంగాణ ఇచ్చిందే ఎక్కువ అని కేసీఆర్ మండిపడటాన్ని ఊహించని బీజేపీ రాష్ట్ర నేతలకు మైండ్ బ్లాంక్ అయింది. పరిశీలకులు కూడా కొంత ఆశ్చర్యపడ్డారు. అమిత్‌షా ఆధిపత్య ధోరణి తప్పేగానీ, కేసీఆర్ మరీ అంత రెచ్చిపోవాలా అనుకున్నారు. తెలంగాణ ఉద్యమకాలం నాటి భావోద్రేకాలను ఎప్పటికప్పుడు వీలైనంత రెచ్చగొట్టి లబ్ధిపొందాలనుకోవటం, తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి తానే మూలమని ప్రజలకు గుర్తు చేస్తూ ఈ గడ్డ మీద అధికారం తమకే ఉండాలని సూచించటం కోసమే రాజీనామా చేస్తాననే స్థాయిలో కేసీఆర్ మాట్లాడారని అభిప్రాయపడుతున్నారు. పార్టీ రాజకీయాలను అలా ఉంచితే.. కేంద్ర పాలక పార్టీ ఆధిపత్యంపై విమర్శలు చేస్తున్న కేసీఆర్ మాత్రం తెలంగాణలో చేస్తున్నదేమిటి? ప్రజలు కడుతున్న పన్నుల డబ్బును ఇష్టమొచ్చినట్టు దుబారా చేస్తూ తన సొంత సొమ్ము దానం చేస్తున్నట్టుగా 'అన్న వరం' అనే రీతిలో (గతంలో ఎన్టీఆర్ చేసినట్టు) ప్రచారం చేసుకోవట్లేదా? అందుకే కేసీఆర్ అమిత్‌షాని తిట్టి మోదీని పొగడటం, ముస్లిం రిజర్వేషన్ల వైఖరి, సంగారెడ్డిలో రాహుల్‌గాంధీ సభకు స్పందన లభించటం వంటి పరిణామాలు వచ్చే ఎన్నికలలో తెలంగాణలో ఎలాంటి ప్రభావం చూపుతాయన్న చర్చలో మైమరచిపోకుండా.. 'మనం పన్నుల డబ్బు ఎంత కడుతున్నాం? మన వనరుల ఆదాయం ఎంత వస్తోంది? ఆ సొమ్మును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలా ఖర్చు చేస్తున్నాయి?' అనే విషయాలను తెలుసుకోవటం ప్రజలకు లాభదాయకం. తెలంగాణ వర్సెస్ ఆంధ్ర అనే విద్వేషాస్త్రాన్ని వచ్చే ఎన్నికలలోనూ ప్రయోగించటానికి కేసీఆర్, చంద్రబాబు ఏమాత్రం వెనుకాడరని గుర్తించి ముఖ్యంగా యువత అప్రమత్తంగా వ్యవహరించాలి.

ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ముఖ్యమంత్రితో పనిలేకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు సక్రమంగా పనులు జరిగేందుకు 'పౌర సేవల' చట్టం తేవటానికి ఇద్దరు ముఖ్యమంత్రులకూ తీరికలేదు. లోక్‌సత్తా రూపొందించిన ఈ బిల్లు ప్రకారం సర్కారీ కార్యాలయాల్లో ప్రతి పనికీ గడువు ఉంటుంది. సిటిజన్ ఛార్టర్లలో చెప్పిన ఈ గడువులోగా పనిచేసిపెట్టకపోతే దరఖాస్తు చేసుకున్న ప్రజలకు రోజుకు కనీసం రూ. 250 పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. పౌర సేవల చట్టం ఏర్పాటు వల్ల.. ప్రజలు బాబ్బాబూ అనుకునే ద్వితీయశ్రేణి పౌరుల్లా కాకుండా తలెత్తుకునే బతికే ప్రభువుల్లా జీవించే పరిస్థితులు ఏర్పడతాయి.

పోలీసు వ్యవస్థలో రాజకీయ జోక్యం వల్ల చట్టబద్ధ పాలన అపహాస్యం పాలవుతూ సామాన్యుడి భద్రత, హక్కుల పరిరక్షణ కూడా గాలివాటంగా మారాయి. సివిల్స్ ఫలితాల్లో జాతీయస్థాయిలో మూడో ర్యాంకును సాధించి ఐఏఎస్‌కు ఎంపికైన రోణంకి గోపాలకృష్ణ తన సొంతూరు శ్రీకాకుళం జిల్లా పారసాంబలో తనకు చట్టపరంగా జరగాల్సిన పని చేయించుకోలేక పలుమార్లు కన్నీటి పర్యంతమయ్యారు. ఎందరికో విన్నవించుకున్నారు. చివరికి ఐఏఎస్‌కు ఎంపికయ్యాకగానీ ఆయన సమస్య పరిష్కారం కాలేదు. గోపాలకృష్ణని తిప్పించుకున్న అధికారులే ఇప్పుడు వీథుల్లో ముగ్గులు వేయించి మరీ ఆయనకు ఊళ్లో స్వాగతం పలికారు. కానీ మిగతావాళ్ల పరిస్థితి? పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేక.. చేసినా న్యాయం జరగక, ఇలాంటి కేసులు, భూ వివాదాలతో అవినీతి వ్యవస్థలో నలిగిపోతూ నిస్సహాయంగా కన్నీరు కారుస్తున్న అమాయకులెందరో తెలుగు రాష్ట్రాల్లో ఉన్నారు.

ఉన్నతస్థాయి అవినీతిపై మాటలే తప్ప చేతల యుద్ధం లేదు. తమ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీని పరిరక్షించుకునేరీతిలోనే కేసీఆర్, చంద్రబాబు చర్యలుంటున్నాయి. ఓటుకు కోట్లు కేసు కావచ్చు, ఎస్సై మోహన్‌రెడ్డి, నయీం కేసులు కావచ్చు, విశాఖ, అమరావతి భూ కుంభకోణాలు కావచ్చు, పుష్కరాలు, రోడ్లు, పట్టిసీమ, పోలవరం కాంట్రాక్టులు, సాగునీటి ప్రాజెక్టుల రీడిజైన్ కావచ్చు.. తమ వారి ప్రయోజనాలకనుగుణంగానే ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి తప్ప చట్టబద్ధపాలన అమలుచేసే ధోరణే లేదు. రాజకీయ నాయకుల కేసుల్ని ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో విచారించాలి అని ఇటీవల మహానాడులో తెదేపా తీర్మానం చేసినా.. కేసులు సక్రమంగా నిగ్గుతేలి దోషులకు తప్పనిసరిగా శిక్ష పడేందుకు స్వతంత్ర ప్రాసిక్యూషన్, నేరదర్యాప్తు పోలీసు విభాగాన్ని రాజకీయ జోక్యం పరిధి నుంచి తప్పించటం, ఏసీబీకి జవాబుదారీతనం గల స్వయంప్రతిపత్తి గురించి మాత్రం చంద్రబాబు ప్రభుత్వం నామమాత్రంగా కూడా మాట్లాడలేదు. అవినీతిపరులను ప్రజల ముందే శిక్షిస్తానని పబ్లిసిటీ డ్రామాలాడుతున్నారు తప్ప, అవినీతిని నిజంగా అంతం చేయగల వ్యవస్థలు ఏర్పాటు చేయటానికి మాత్రం చర్యలు తీసుకోవటం లేదు. ఓటుకు కోట్లు కేసులో తెదేపా నల్లడబ్బుతో ఎమ్మెల్యేని కొనుగోలు చేస్తున్నట్టు ప్రజలందరూ చూసినా ఏం జరుగుతోంది?!

అమరావతి, పోలవరం తన రెండు కళ్లు అని కూడా మహానాడు సందర్భంగా చంద్రబాబు చెప్పుకొచ్చారు. వీటిలో మొదటిది అసంబద్ధమైన రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు కాగా, రెండోది పూర్తిగా కేంద్రం చేత చేయించాల్సిన పని. ఇవి రెండే

## పొత్తు వైపే ప్రస్తుతానికి బీజేపీ మొగ్గు

ఏపీకి అంతిచ్చాను, ఇంతిచ్చాను గత ఏడాది గోదారి గట్టున ఊదరగొట్టినా ముఖ్యమంత్రి చంద్రబాబు ఏమీ అనకపోవటంతో, ఇదియునూ అట్టిదియే అని ఇటీవల తెలంగాణలో కూడా అలాగే లక్ష కోట్ల లెక్కను అమిత్‌షా వక్కాణించారు. కానీ ఎదురుదాడి జరిగి షాక్‌తో పరాభవాన్ని మూటకట్టుకున్నారు. దళితులతో సహపంక్తి భోజనం పేరుతో అన్నపూర్ణ హోటల్ నుంచి తెప్పించిన ఫుడ్‌ను తిన్నారని కేసీఆర్ సాక్ష్యాధారాలతో చెప్పటం అమిత్‌షాకు మింగుడు పడలేదు. కేసీఆర్ చేసిన గాయానికి చంద్రబాబు కాస్త వెన్నపూసి పసందైన విందును కూడా ఏర్పాటుచేసి ఊరడించడటంతో సేదతీరి ఏపీలో మళ్లీ పాత రికార్డును కొనసాగించి రూ. 1,75,000కోట్లు సాయమందించినట్టు అమిత్‌షా చెప్పుకొచ్చారు (ప్రత్యేక ప్యాకేజీ ద్వారా 'హోదా' కంటే 100 రెట్లు ఎక్కువ సాయాన్ని ఏపీకి చేశామని, ఇప్పటివరకు రూ. 2,30,000కోట్ల ప్రాజెక్టులు వచ్చేలా చేశామని ఆ తర్వాత కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు కొత్త లెక్కలు చెప్పారు). కేసీఆర్‌లా మీరెందుకు కౌంటర్ ఇవ్వరు అని విపక్షాలు దాడులు చేసినా, ప్రజలు ఎదురుచూసినా చంద్రబాబు పట్టించుకోకుండా బీజేపీతోనే మళ్లీ ఎన్నికలకు అన్నట్టు వ్యవహరిస్తున్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా తేలేకపోవటం వంటి వైఫల్యాలను మరపించేందుకు 'ఎన్టీఆర్‌కి భారతరత్న' వంటి అంశాలపై కసరత్తు చేస్తున్నారు. వ్యతిరేకుల్ని సహించలేని మోదీయే వచ్చేసారీ ప్రధాని అయ్యే అవకాశాలు ఉండటంతో, విపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కూడా బీజేపీతో స్నేహం కుదుర్చుకుని కేసుల బెడదను వదిలించుకోవాలని చూస్తున్నారు. రోజుకోరకంగా స్టేట్‌మెంట్లు ఇస్తూ తమకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుండటంతో జనసేన వ్యవస్థాపకుడు పవన్ కళ్యాణ్‌ను నమ్మలేమని బీజేపీ భావిస్తోంది. తన సినిమాలకు పెట్టుబడులను బీజేపీ అడ్డుకుంటోందన్నది పవన్ వర్గీయుల ఫిర్యాదు! మిత్రపక్షాలు సహా ఇతర పార్టీల నుంచి నేతలను దిగుమతి చేసుకుని ఒంటరిపోరుకు వెళ్లాలని ఉన్నా, పరిణామాలు అనుకూలంగా లేవని అమిత్‌షా పర్యటనలో స్పష్టమవటంతో.. ప్రతిష్టగల నేతలను పెంచుకుని, సాధ్యమైనన్ని ఎక్కువ సీట్లను తీసుకుని పొత్తులతోనే ఎన్నికలకు వెళ్లాలన్న ఆప్షన్ వైపే ప్రస్తుతానికి ఏపీలో బీజేపీ ఎక్కువ మొగ్గుచూపుతోంది. ఈ వ్యూహంలో భాగంగానే ఏకకాలంలో తెదేపా, జగన్ పార్టీలకు ఆఫర్‌లిస్తూ పరిస్థితులను నిశితంగా గమనిస్తోంది. ఈ పార్టీల ఓట్లు, సీట్ల లెక్కల్లో చిక్కుకోకుండా.. మోసం చేసినవారికి కీలెరిగి వాతపెడుతూ, విధానాలు, అభ్యర్థుల విశ్వసనీయ చరిత్ర ఆధారంగా వచ్చే ఎన్నికల్లో నిర్మొహమాటంగా ఓట్లు వేయటమే ప్రజలు చేయాల్సిన పని.

ఆయన ఎఛీవ్‌మెంట్లు అనుకుంటే.. చంద్రబాబు కాకుండా వేరెవరున్నా ఆ పనులు జరిగిపోతాయి. బాబు మాత్రమే చేయగలరని ఆశించి 2014లో ప్రజలు ఓటు వేసిన స్థాయి విజయాలను ఆయన చూపలేకపోతున్నారు.

### సామాన్యులు, మహిళల కోసం స్థానిక న్యాయస్థానాల యోచనే లేదు

తమ కంపెనీల అవసరాల కోసం న్యాయవ్యవస్థపై ప్రభావం చూపేలా వ్యవహరించటం, హైకోర్టును విభజించమనటం తప్ప రాష్ట్రంలోని సామాన్య ప్రజలకు త్వరగా, చౌకగా న్యాయం అందించటానికి, మహిళల భద్రతకు కీలకమైన స్థానిక న్యాయస్థానాలను ఏర్పాటు చేద్దామన్న యోచన ఏ ముఖ్యమంత్రికీ లేదు.

### కరవుతో పొరుగు రాష్ట్రాల్లో డిమాండ్ ఉన్నా, మన ధాన్యం రైతులకు మద్దతు ధర రావటమే గగనం

ఇక రెండు రాష్ట్రాల్లో అత్యధికులు ఆధారపడే వ్యవసాయాన్ని బాగు చేసేందుకు రైతుకు ఆదాయాన్ని పెంచాలనే ప్రయత్నాన్ని చిత్తశుద్ధితో ఇద్దరు ముఖ్యమంత్రులూ చేయలేదు. రైతుకు న్యాయమైన ధర రావటానికి ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయకుండా.. రుణమాఫీ, ఎరువుల ఉచితం వంటి తాత్కాలిక అంశాలకే పరిమిత మవుతున్నారు. మిర్చి ధరల పతనం వల్ల ఒక్క ఏపీలోనే రైతులు ఒక్క సీజన్‌లో రూ. 5,000 కోట్లు నష్టపోయారంటే, ప్రభుత్వాల ఉచితాలు ఎంత పేలవమైన పరిష్కారాలో అర్థమవుతుంది. సరైన నిల్వ ఏర్పాట్లు లేకపోవటం అన్న ఒక్క సమస్య వల్లే దేశవ్యాప్తంగా రైతులు ఏటా రూ. 1లక్ష కోట్లుపైగా నష్టపోతున్నారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రానికి అధికారికంగా పంపిన నివేదికలోనే పేర్కొంది. కూరగాయలు, పత్తి వంటి వాటి విషయంలో అధికోత్పత్తి (సప్లయ్) సమస్య ఉందనుకున్నా.. డిమాండ్ ఎక్కువ ఉన్న ధాన్యానికి కూడా అధికధర ఇప్పించటంలో ఈ ఏడాది తెలుగు పాలకులు విఫలమయ్యారు. ఈ సంవత్సరం తమిళనాడు, కేరళలో కరవు పరిస్థితులు తాండవిస్తూ బియ్యానికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. అయినా, మన తెలుగు రాష్ట్రాలలో ధాన్యం రైతుకు మద్దతు ధరకు మించి ఇవ్వటానికి, కనీసం బోనస్ ప్రకటించటానికి కూడా ప్రభుత్వాలకు చేతులు రాలేదు. సరైన పరపతి వ్యవస్థ, ప్లెడ్జి రుణాల ఏర్పాటు లేకపోవటం వల్ల పలుచోట్ల చిన్నరైతులు కళ్లాలలోనే మద్దతుధర కంటే తక్కువకే ధాన్యాన్ని అమ్ముకున్నారని వార్తలు వచ్చాయి. డిమాండ్ ఉన్నా, లాభసాటి ధర రాకుండా చేసిన పాలకుల పాపం గురించి ఆలోచించే చైతన్యం, తీరిక రైతులకు లేదు కాబట్టి.. ఎప్పటికప్పుడు ఏదోక స్కీముతో వారిని బురిడీ కొట్టించొచ్చన్న దిలాసాలో పాలకులున్నారు. రైతు ఆదాయం చుట్టూ మాత్రం చర్చ పెరగకుండా జాగ్రత్త పడుతూ వ్యవసాయ సంక్షోభాన్ని పెంచుతున్నారు.

### దుర్భర జీవితాల నగరాలకు వలసలు

## చర్చను సహించలేకపోతున్నారు

ఇద్దరు ముఖ్యమంత్రులూ విధానాలు, అభివృద్ధి నమూనాపై ప్రజాస్వామిక చర్చను ఏమాత్రం సహించలేకపోతున్నారు. శాంతియుత ఆందోళనలను కూడా అణచివేస్తున్నారు. చట్టబద్ధ పాలనను సక్రమంగా అమలు చేయటం లేదు. పోలీసు వ్యవస్థను జేబు సంస్థగా ఉపయోగించుకుంటూ ప్రత్యర్థులను ఇబ్బందులు పెడుతున్నారు. సోషల్ మీడియా లేకుంటే కేసీఆర్, చంద్రబాబు పాలనను ప్రశ్నించటం దాదాపు అసాధ్యమైపోయేది. కానీ సోషల్ మీడియా చర్చల్లో హేతుబద్ధత, నిర్మాణాత్మక సృజనాత్మకత పాళ్లు తక్కువగా ఉండటంతో నెటిజన్ల ప్రభావాన్ని వీళ్లు ఇంకా నియంత్రించగలుగుతున్నారు.

గ్రామాలకు, పట్టణాలకు అంతరాలను తగ్గించే ప్రయత్నం చేసి చిన్న పట్టణాలను అభివృద్ధి చేయటానికి బదులు వలసల పట్టణీకరణను పెద్దఎత్తున ప్రోత్సహించటం, నగరాలలో కనీస వసతులు కరవవటం, రోజువారీ పనులు సవ్యంగా సాగటానికి వార్డు స్థాయిలో తలసరి కేటాయింపు వంటి చర్యలు లేకపోవటంతో జనజీవనం తెలుగు రాష్ట్రాలలో దుర్భరంగా మారుతోంది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా ఎండలకు పిట్టల్లా రాలిపోయిన జనంలో అత్యధికులు తెలుగు రాష్ట్రాలవారే. అందుకు ప్రస్తుత పాలకులే బాధ్యులు. మిగతా రాష్ట్రాన్ని పట్టించుకోకుండా అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మీదే ప్రభుత్వం దృష్టిపెట్టటం వంటి చర్యలు తప్పుడు సంకేతాలనిస్తున్నాయి.

### కుటుంబ సభ్యులకే పగ్గాలు

ఇంతా చేసి.. ప్రైవేట్ కాబట్టి ఆ కంపెనీలు చివరికి ప్రజల సొంతమవవు. చంద్రబాబు, కేసీఆర్ కుటుంబ వారసుల సొంతమవుతాయి. సామాన్య యువతకు, కార్యకర్తలకు ఎంత టాలెంట్ ఉన్నా.. ఆ కంపెనీల అంచనాల్లో కేటీఆర్, హరీష్‌రావు, లోకేష్‌లకు సాటిరారు. వారికి అంత వేగంగా అవకాశాలుండవు.

నిజానికి రాష్ట్రంలోనివారంతా తమ కంపెనీలోని వారే అని భావించి ఉంటే, తెదేపా, తెరాస కూడా ప్రజాసంస్థల్లా నిర్మాణమై ఉండేవి. ప్రజల ఆస్తుల్లా మారి ఉండేవి. టాలెంట్ ఉన్నవారికి వేగంగా ఉన్నత పదవులకు ఎదిగే అవకాశాలను కల్పించేవి. కానీ అవి రాష్ట్ర పాలనను ప్రైవేటు కంపెనీలా నడపటానికి ప్రైవేటు వాహనాల్లా, ఎస్టేటుల్లా మారాయి. వ్యాపారస్తుడి కొడుకు వ్యాపారస్తుడు అవ్వొచ్చు, హీరో కొడుకు హీరో అవ్వొచ్చు, అలాగే రాజకీయ నాయకుడి కొడుకు రాజకీయ నాయకుడు అయితే తప్పేంటి? అని చంద్రబాబు నాయుడు మహానాడు సందర్భంగా ప్రశ్నించారు. అదీ ఆయన ప్రజాస్వామిక అవగాహనా స్థాయి! గొప్ప విదేశాలన్నీ తిరిగొచ్చా అని తరచూ చెప్పుకునే చంద్రబాబుకి.. ఒక నాగరిక ప్రజాస్వామ్య వ్యవస్థలో తల్లిదండ్రులు బిడ్డలకు ఇవ్వాల్సింది మంచి చదువు, ఆరోగ్యం, ఎదిగే అవకాశాలున్న మంచి సమాజాన్ని తప్ప రాజ్యాల్ని కాదని, ఉమ్మడి అవసరాలను తీర్చే రాజకీయాలలోకి అత్యుత్తమ నైపుణ్యాలు, సేవాభావం ఉన్నవారే రావాలని మాత్రం అర్థం కాలేదు. ఇటీవల కేంద్ర మంత్రి వెంకయ్యా నాయుడు కూడా వంశపారంపర్య రాజకీయాలపై పట్టునడలించి బాబు వంటి వారికి పరోక్షంగా వత్తాసు పలికేలా సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. వెంకయ్య కూడా తన పిల్లలకు పార్లమెంటు సభ్యత్వం కోసం ప్రయత్నిస్తున్నట్టు వినికిడి. మిగతావారెవరికీ రానంత వేగంగా తమ కుటుంబసభ్యులకు రాజకీయాల్లో అవకాశాలు రావటం తప్పేనని సూత్రప్రాయంగా అంగీకరిస్తూ మార్పు దిశగా వెళ్తుండటం వేరు.. అసలు వంశపారంపర్య రాజకీయాలు తప్పే కాదని వాదించటం వేరు!

### సొంతలాభం లేకుంటే.. ప్రజల గురించే పట్టించుకోరు

'నిజమేనయ్యా.. ప్రైవేటు లాభాలు లేకపోతే అసలు మాకు రాజకీయాలెందుకు' అని వీరు సిగ్గుపడకుండానే ప్రశ్నిస్తారు. అధికారంలోకి రాకపోతే ఇంటికి పోతాం అని కేసీఆర్ (జీహెచ్ఎంసీ ఎన్నికలప్పుడు కేటీఆర్ కూడా ఇదే మాట అన్నారు) అంటే, పార్టీ మూసేసి వ్యాపారం చూసుకుంటానని చంద్రబాబు అంటారు. ఒక కరడుగట్టిన ప్రైవేటు కంపెనీ యాజమాన్యానికుండే అసలుసిసలైన లక్షణం ఇదే! ఇలాంటి నేతల పాలనతో యధాతథ స్థితి కొనసాగుతూ యధాలాప మార్పు రావొచ్చేమోగానీ మనం భవిష్యత్ తరాలకి ఎంత జీవనయోగ్యమైన సమాజాన్ని, ప్రపంచాన్ని అందించగలమా అన్నది ఆలోచిస్తేనే భయం కలిగించే ప్రశ్న.

ఓట్లు, సీట్లుతో సంబంధం లేకుండా ప్రజల కోసం, దేశాభివృద్ధి కోసం సంస్కరణలు, విధానాలతో పనిచేసే లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ్ లాంటివారు కేసీఆర్, చంద్రబాబు లాంటి పాలకులకు, వారి స్థాయి రాజకీయ చైతన్యం ఉన్న వారికి విచిత్రంగానో, తిక్కగానో కనిపించవచ్చు. వారి సమీప ప్రత్యర్థులుగా ఉన్నవారిది కూడా అదే తరహాలో ప్రైవేటు కంపెనీల సంస్కృతే కాబట్టి వారికీ అలాగే అనిపించవచ్చు. కానీ పాలనలో, ప్రజాజీవితంలో ప్రైవేటు/కార్పొరేట్ కంపెనీ పనితీరు వల్ల జరుగుతున్న దారుణ నష్టాన్ని, అధికారంలేకున్నా ప్రజల పట్ల ప్రేమతో, అవగాహనతో వ్యవస్థల కోసం పనిచేసేవారిని ఎన్నికల్లో గెలిపించాల్సిన అవసరాన్ని మనమెప్పుడు గుర్తించి పౌరసత్వంతో వ్యవహరిస్తాం? ఈ ప్రశ్నకు జవాబు మీదే మన నిజమైన అభివృద్ధి, మన భావితరాల భవిష్యత్తు ఆధారపడి ఉన్నాయి. ❍

# మరో సర్వేదీ అదే హెచ్చరిక!

అభివృద్ధికి, వికాసానికి పునాది అయిన ప్రాథమిక విద్యకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లు ఖర్చు చేస్తున్నట్టు కనిపిస్తున్నా అనుకున్న ఫలితాలు రావటం లేదని, దేశంలో అత్యధికశాతం పిల్లలకు నాసిరకం చదువు అందుతోందని మరో సర్వే ధృవీకరించింది. ప్రభుత్వ బడుల్లో ప్రమాణాలు నానాటికీ తగ్గిపోతున్నాయని, విద్యార్థులు మెరుగైన గ్రేడ్‌లు కూడా సాధించలేకపోతున్నారని తెలిపింది. ఆంధ్రప్రదేశ్ విద్యా పరిశోధన, శిక్షణ మండలి, సర్వశిక్షా అభియాన్ నిర్వహించిన 3, 5, 8 తరగతుల రాష్ట్రస్థాయి సముపార్జన సర్వే – 2017లో అనేక విషయాలు వెల్లడయ్యాయి. సంగ్రహణాత్మక మూల్యాంకనం (ఎస్ఏ)–1లో రాష్ట్రం మొత్తం మీద 'డీ2' గ్రేడ్ వచ్చినవారు 7.69శాతం ఉండగా.. ఏడు జిల్లాలు రాష్ట్రం సరాసరి కంటే వెనుకబడ్డాయి. తూర్పు గోదావరి జిల్లా 12.03శాతం, గుంటూరు 11.59శాతంతో అట్టడుగున నిలిచాయి. తూర్పు గోదావరి జిల్లాలో విద్యార్థుల సామర్థ్యాల సాధనకు మరింత కృషి చేయాల్సి ఉందని సర్వే సూచించింది. సాధారణంగా రానురాను ఫలితాలు మెరుగవుతుంటాయి. కానీ, చాలా జిల్లాలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయని తెలిపింది. అనంతపురం జిల్లాలో ఎస్ఏ–1లో 34,251 మంది 'డీ2' గ్రేడ్ సాధించినవారు ఉండగా.. ఎస్ఏ–2కు వచ్చేసరికి వీరి సంఖ్య 63,867కి పెరిగింది. ఇది విద్యార్థుల్లో ప్రమాణాలు పడిపోతున్న తీరుకి అద్దం పడుతోంది. నెల్లూరు జిల్లాలో ఎస్ఏ–1లో 'డీ2' గ్రేడ్ వచ్చినవారు 29,300 మంది విద్యార్థులు ఉండగా, ఎస్ఏ–2కు వచ్చేసరికి వీరి సంఖ్య 38,827కి పెరిగింది. ప్రకాశం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల పరిస్థితి ఇదే విధంగా ఉంది.



■ 8వ తరగతి గణితంలో అనుసంధానం చేయుట అనే విద్యాప్రమాణంలో మినహా మిగతా సమస్యా సాధన, నిరూపణ–కారణాలు వెతుకుట, దృశ్యీకరణ, సమాచారాన్ని వ్యక్తపరచుట సాధించలేని విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంది. తెలిసిన సమాచారాన్ని వ్యక్తపరచలేనివారు రాష్ట్రవ్యాప్తంగా 8వ తరగతిలో 26.4శాతం మంది ఉన్నట్టు సర్వేలో వెల్లడైంది. 9వ తరగతిలో అనుసంధానం చేయడం రానివారు దాదాపు మూడోవంతు వున్నారు.

■ 8, 9 తరగతుల భౌతిక, రసాయన శాస్త్రాల్లో విషయ అవగాహన లేనివారు వరుసగా 12.3శాతం, 14.2శాతం మంది ఉన్నారు. ప్రయోగాలు–క్షేత్ర పరిశీలన సక్రమంగా చేయనివారు 8లో 35.3శాతం, 9లో 36.7శాతం ఉన్నట్టు సర్వేలో తేలింది. 8వ తరగతితో పోలిస్తే 9లో మ్యాప్ పాయింటింగ్ నైపుణ్యం, నమూనాల తయారీ అనే విద్యాప్రమాణాన్ని సాధించలేని వారి సంఖ్య ఎక్కువగా ఉంది.

■ జీవశాస్త్రంలో 8, 9 తరగతుల్లో ప్రయోగాలు–నైపుణ్యాలు సాధించని పిల్లలు 33.6శాతం, 22.3శాతంగా ఉన్నట్టు సముపార్జన సర్వేలో వెల్లడైంది. విద్యా ప్రమాణాల పెంపునకు పలు చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో అమలు లేకపోవటంతో బడి చదువులు అధ్వాన్నంగా తయారయ్యాయి. ❍

# మన కేంద్రీయ వర్సిటీలన్నీ కలిసినా.. కేంబ్రిడ్జి కంటే తక్కువే!

పరిశోధనల విషయంలో భారత్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయాలన్నీ (39) కలిసినా బ్రిటన్‌లోని కేంబ్రిడ్జికి, అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్‌కి సరితూగలేకపోతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. పరిశోధనలు చేపట్టేందుకు తగినన్ని మౌలిక వసతులు లేకపోవటం, ప్రోత్సాహకాల కొరత, ఆర్థిక చేయూత కొరవడటం తదితర కారణాల వల్ల భారత్‌కు ఈ పరిస్థితి ఏర్పడిందని అధ్యయనకారులు తెలిపారు. మొత్తం పరిశోధనాపత్రాలు, అంతర్జాతీయ భాగస్వామ్యంతో ప్రచురించిన పత్రాలు, ఇతరత్రా అంశాలకు సంబంధించి లెక్కలు తీసి.. ఈ వివరాలు తెలిపారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం, బెనారస్ హిందూ వర్సిటీలాంటి పాత విద్యాలయాలు, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం లాంటి చిన్న వర్సిటీలు పరిశోధనల్లో కొంత మెరుగ్గా ఉన్నాయన్నారు. ❍

# డిగ్రీ, పీజీ నిరుద్యోగుల్లో తెలుగు రాష్ట్రాల ముందంజ

గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ నిరుద్యోగుల సంఖ్యలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జాతీయసగటును మించిపోయాయి. దేశవ్యాప్తంగా ప్రతి వెయ్యిమంది నిరుద్యోగుల్లో 58.3శాతం పట్టభద్రులు, 62.4శాతం మంది పీజీ చేసినవారున్నారు. ఏపీలో డిగ్రీ నిరుద్యోగుల వాటా 69.8శాతంగా ఉంటే, తెలంగాణలో 86.9శాతంగా ఉంది. అర్హతకు తగిన ఉద్యోగాలు లేవని ఈ నిరుద్యోగులు చెబుతుండగా, ఉద్యోగాలకు తగిన నైపుణ్యాలు లేకపోవటం వల్లే వీరికి ఉద్యోగాలు దొరకటం లేదని మార్కెట్ విశ్లేషకులు అంటున్నారు. దేశవ్యాప్తంగా ఉద్యోగిత, నిరుద్యోగం, యువత, ఉపాధి అంశాలపై సర్వే నిర్వహించిన కార్మికశాఖ ఐదవ నివేదిక వెల్లడించింది.

తెలుగు రాష్ట్రాలలో 40శాతానికిపైగా యువత తాత్కాలిక ఉద్యోగులుగా ఉన్నారని నివేదిక తెలిపింది. సర్వే సమయంలో తాము ఉద్యోగులు, కార్మికులుగా ఉన్నామని చెబుతున్నా.. ఏడాది మొత్తం ఉపాధి వీరికి లభించటం లేదు. తాత్కాలిక ఉద్యోగాలలో వీరికి ఉద్యోగ భద్రతతో కూడిన లాభాలేవీ అందటం లేదు. ఎటువంటి ఒప్పందాలూ వీరికి యాజమాన్యాలు ఇవ్వటం లేదు. జాతీయస్థాయిలో 40శాతం మంది కార్మికుల పరిస్థితి ఇలాగే ఉంది.

నివేదికలోని మరికొన్ని అంశాలు:

■ నిరుద్యోగ రేటులో ఏపీతో పోలిస్తే తెలంగాణ గణాంకాలు మెరుగ్గా వున్నాయి. జాతీయ సగటు నిరుద్యోగం 5శాతంగా నమోదుకాగా, తెలంగాణలో నిరుద్యోగం 2.8శాతంగా కనిపిస్తోంది. ప్రతి వెయ్యిమందిలో 28 మందికి ఎటువంటి ఉపాధి, ఉద్యోగం లేకుండా ఉన్నారు. ఏపీలో ప్రతి వెయ్యిమందిలో 39 మందికి ఉపాధి లేదు. ■ స్వయం ఉపాధిని మార్గంగా ఎంచుకున్నప్పటికీ నెల ఆదాయం రూ.7500 దాటటం లేదు. కేవలం 0.1శాతమే స్వయంఉపాధి కింద రూ.లక్షకు పైగా సంపాదిస్తున్నారు. ■ ఉపాధి హామీ కింద దాదాపు 24శాతం కుటుంబాలు ఉపాధి పొందుతున్నారు. 48.4శాతం కుటుంబాలు ఒక్కరి ఆదాయంపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. ■ కార్మికులలో మహిళల ప్రాధాన్యత తెలుగు రాష్ట్రాల్లో జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉన్నా వేతనాల్లో పురుషుల కంటే తక్కువే వారికి లభిస్తోంది. మహిళల ప్రాధాన్యతకు సంబంధించి జాతీయ సగటు 23.7శాతం ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో 46.6, తెలంగాణలో 44శాతంగా ఉంది. ■ తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాలలో నిరుద్యోగ పట్టభద్రుల శాతం 94.0శాతం కాగా, ఏపీలో 62.8శాతంగా ఉంది. ■ తెలుగు రాష్ట్రాల్లో 20శాతం మందికి ప్రతి నెలా రూ.5వేల లోపు ఆదాయం వస్తోంది. ■ ప్రతి వెయ్యిమందిలో రూ.50వేలకు పైగా సంపాదిస్తున్నవారిలో తెలంగాణ నుంచి 104మంది ఉండగా, ఏపీ నుంచి 72మంది ఉన్నారు. ❍

# గుత్తాధిపత్యాన్ని బద్దలుకొట్టిన దాసరి



తెలుగు సినిమా పరిశ్రమలో రెండు మూడు కుటుంబాల గుత్తాధిపత్యాన్ని బద్దలు కొట్టి సామాన్యులకు అవకాశం కల్పించిన బహుముఖ ప్రజ్ఞాశాలి దాసరి నారాయణరావు అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. హైదరాబాద్‌లోని ఫిల్మ్‌ఛాంబర్‌లో దాసరి భౌతికకాయానికి నివాళులర్పిస్తూ.. సామాజిక దృష్టిగల చిన్న చిత్రాలను నిర్మించి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని పరిశ్రమలో నెలకొల్పారని, పలువురు కార్మికులకు జీవనభద్రత కల్పించారని గుర్తుచేసుకున్నారు. మీడియారంగంలోకి ప్రవేశించి 'ఉదయం' దినపత్రిక ద్వారా దాసరి విలువైన సామాజిక, రాజకీయ సేవ చేశారని జేపీ అన్నారు. ❍

# తెరాస ప్రభుత్వం.. మూడేళ్లలో ముప్పై వైఫల్యాలు

**మూ**డేళ్ల పాలనలో తెరాస ప్రభుత్వం 30 వైఫల్యాలను మూట గట్టుకుందని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర విభాగం ఆరోపించింది. ఎన్నికలకు ముందు, అధికారంలోకి వచ్చాక ఇచ్చిన అనేక హామీలు ఇంకా అమలుకు నోచుకోలేదని పార్టీ రాష్ట్ర కార్యదర్శి అల్లేని నిఖిల్ అన్నారు. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానన్న హామీ మొదలుకుని, దళితులకు మూడెకరాల పంపిణీ, మతరిజర్వేషన్లతో కులాల మధ్య చిచ్చు, రైతుల ఆత్మహత్యల నివారణలో వైఫల్యం, రిజిస్ట్రేషన్ శాఖలో అవినీతి తదితర అంశాలపై 30 ప్రశ్నలను కేసీఆర్ ప్రభుత్వానికి ఆయన సంధించారు.



1) దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని ఎందుకు మాట తప్పారు?

2) మూడేళ్లలో ఎంతమంది దళితులకు మూడెకరాల భూమి ఇచ్చారు, ఆ హామీ ఎప్పటికి నెరవేరుస్తారు?

3) మత రిజర్వేషన్లతో కులాల మధ్య చిచ్చుపెట్టడం సమంజసమేనా?

4) రైతు ఆదాయాన్ని పెంచలేకపోవటం, ఆత్మహత్యలను నివారించలేకపోవటం మీ వైఫల్యం కాదా?

5) తెలంగాణకు వ్యతిరేకంగా పనిచేసినవారి ఎజెండాను అమలు చేయడం వాస్తవం కాదా?

6) సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకపోవడం సమంజసమేనా?

7) డబుల్ బెడ్‌రూం ఆశలు అడియాశలేనా?

8) హైదరాబాద్‌ను ఇస్తాంబుల్, కరీంనగర్‌ను లండన్, పారిస్ చేస్తానన్నారే.. ఏమైంది?

9) హైదరాబాద్ సిగ్నల్ ఫ్రీ సిటీ, స్కైవేల హామీలే ఏమయ్యాయి, హుస్సేన్‌సాగర్ ప్రక్షాళన జరిగిందా, మూసీ నది మురికి వదిలిందా?

10) అవకతవకలు, రాజ్యాంగ ఉల్లంఘనలు జరిగాయని 'కాగ్' మీ ప్రభుత్వాన్ని తలంటడం వాస్తవం కాదా?

11) ఎంసెట్ లీకేజీ మీ వైఫల్యం కాదా?

12) లక్ష ఉద్యోగాలంటూ ప్రకటనలివ్వడమే కానీ నియామకాలు జరిపారా?

13) ఎన్నోసార్లు హైకోర్టుతో మొట్టికాయలు వేయించుకోవడం వాస్తవం కాదా?

14) ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో అవినీతి సంగతేంటి?

15) అమరవీరుల కుటుంబాల్ని విస్మరించడం వాస్తవం కాదా?

16) కేజీ టూ పీజీ ఉచితవిద్య హామీని ఎందుకు నీరుగార్చారు?

17) ఆదాయం కోసం మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తూ ఎందుకు పేద ప్రజల జీవితాలతో, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు?

18) మల్లన్నసాగర్, మిడ్‌మానేర్ తదితర ప్రాజెక్టుల కోసం అక్రమంగా భూములు లాక్కోవడం వాస్తవం కాదా?

19) గ్యాంగ్‌స్టర్ నయీం కేసు నీరుగార్చడం వెనక వాస్తవం ఏమిటి?

20) ఓయూ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించాల్సిన విధానం ఇదేనా, ప్రారంభోత్సవంలో మీ మౌనం దేనికి సంకేతం?

21) విమర్శలకు జవాబివ్వలేక ధర్నాచౌక్‌ను ఎత్తివేయడం ప్రజాస్వామికమేనా?

22) తెలంగాణ ఉద్యమానికి వ్యతిరేకంగా పనిచేసినవారికి పదవులివ్వడం వాస్తవం కాదా, తెలంగాణ ద్రోహులతో బంగారు తెలంగాణ ఎలా సాధ్యమవుతుంది?

23) గ్రామజ్యోతి పథకానికి నిధులివ్వకుండా స్థానిక స్వయంపాలనను దగా చేయలేదా?

24) ఫిరాయింపులను ప్రోత్సహించి దొంగదారిలో మెజారిటీ పెంచుకోవడం ప్రజాస్వామ్యస్ఫూర్తికి తూట్లు పొడవడం కాదా?

25) ప్రభుత్వ ఆసుపత్రుల్లో వరుస మరణాలు దేనికి సంకేతం?

26) సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పిస్తామని తీసుకున్న దరఖాస్తులు ఎక్కడున్నట్టు?

27) మిషన్ భగీరథపై వస్తున్న ఆరోపణలపై ఎందుకు విచారణ జరపడం లేదు?

28) రాష్ట్రంలో నిర్మాణపనుల్లో పర్సంటేజీలు తీసుకుంటున్నారనేది నిజం కాదా?

29) అధికారుల అవినీతితో ప్రజల అవస్థలు మీ దృష్టికి ఎందుకు రావడం లేదు?

30) రిజిస్ట్రేషన్ శాఖలో అవినీతి జరగడం, దీనిపై మాటలు తప్ప సంస్థాగత ఏర్పాట్లు లేకుండా దాటవేయడం వాస్తవం కాదా?

కుటుంబ పాలనలో బందీ అయిన తెలంగాణ రాష్ట్రాన్ని విముక్తి చేసేందుకు మరో పోరాటానికి సిద్ధం కావాలని నిఖిల్ విజ్ఞప్తి చేశారు. ❍

# రైతులకు రుణమాఫీ ఏమాత్రం ఉపయోగపడలేదు

## మూడేళ్లలో 2,993 మంది రైతుల ఆత్మహత్య .. సీఎం నియోజకవర్గంలోనే అత్యధికం

తెలంగాణలో గత మూడేళ్లలో 2,993మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, మహిళా రైతుల ఆత్మహత్యల్లో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని తెలంగాణ రైతు ఐకాస వెలువరించిన నివేదిక తెలిపింది. "రైతుల ఆత్మహత్యల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గమే మొదటి స్థానంలో ఉంది. ఎకరానికి కోటి రూపాయల ఆదాయం అందించే ఆయన వ్యవసాయక్షేత్రం కూడా ఈ నియోజకవర్గంలోనే ఉంది. ఈ ప్రాంతంలోనే రైతుల బలవన్మరణాలు ఎక్కువగా ఎందుకు జరుగుతున్నాయో ప్రభుత్వంలో చర్చ జరగలేదు. వ్యవసాయాన్ని గిట్టుబాటు చేసేందుకు ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు" అని పేర్కొంది. "గడచిన తెరాస మూడేళ్ల పాలన (2014-17) - వ్యవసాయరంగ స్థితిపై ఒక పరిశీలన" పేరుతో ఈ నివేదికను విడుదల చేశారు. ఇందులోని మరిన్ని ముఖ్యాంశాలు:

- గజ్వేల్‌లో 107, జనగామలో 79, హుస్నాబాద్‌లో 83, మంథని-76, దుబ్బాక-81, నాగార్జునసాగర్-72, పరకాల-74, నకిరేకల్-69, దేవరకొండ-66, నాగర్‌కర్నూలు-63, బోథ్‌లో 61మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు.

***"రైతుల ఆత్మహత్యల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గమే మొదటి స్థానంలో ఉంది. ఎకరానికి కోటి రూపాయల ఆదాయం అందించే ఆయన వ్యవసాయక్షేత్రం కూడా ఈ నియోజకవర్గంలోనే ఉంది. ఈ ప్రాంతంలోనే రైతుల బలవన్మరణాలు ఎక్కువగా ఎందుకు జరుగుతున్నాయో ప్రభుత్వంలో చర్చ జరగలేదు. వ్యవసాయాన్ని గిట్టుబాటు చేసేందుకు ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు"***

- దళిత కుటుంబాలకు 3 ఎకరాల భూమిని అందించే ప్రక్రియ ఇదే విధంగా నడిస్తే అనుకున్న లక్ష్యం చేరడానికి 300 ఏళ్లు పడుతుంది.
- రైతులకు రుణమాఫీ ఏమాత్రం ఉపయోగపడలేదు. మూడేళ్ల తరువాత చూస్తే అనేకమందికి వడ్డీ భారానికి తోడు అప్పులు మిగిలాయి. సాగు వ్యయం ప్రకారం గిట్టుబాటు ధర రానందున రైతులు వందలాది కోట్ల రూపాయలు నష్టపోయారు. ❍

# చంద్రబాబు అమెరికా యాత్ర

- ఎ. అన్నపూర్ణ, కాలిఫోర్నియా




ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల అమెరికాలో పర్యటించారు. ఇక్కడ తెలుగు టీవీ ఛానల్స్‌లో ఆయన ప్రసంగాలు విన్నాను. 'అమెరికాలో ఎక్కువ ఆదాయం సంపాదించేవారు భారతీయులు. అందులోనూ ముఖ్యంగా తెలుగువారు. మిమ్మల్ని చూస్తే నాకు గర్వంగా ఉంది. మీలో ఒక్కొక్కరూ ఒక్కో బాహుబలి కావాలి' అన్నారు బాబు. సిలికాన్ వ్యాలీలో సోలార్ సిస్టంతో నడిచే 'టెస్‌లాక్' కార్లను చూసి (ప్రయాణించి) మురిసిపోయారు. ఏపీ రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణల్ని తీసుకురావాలనే ఆకాంక్షను మెచ్చుకోవాల్సిందే. అమెరికాలో చాలావరకు ఇళ్లు, కంపెనీలు, ఆఫీసులు, వీధిదీపాలు, కొత్తగా కార్లకీ సోలార్ సిస్టం ఉంది. అత్యంత వేగంగా దేశమంతా విస్తరిస్తోంది. ఈ మార్పుకి మనదేశంలోని ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి ముచ్చటపడటం బాగానే ఉంది. మన రాష్ట్రాలలో అమలుచేస్తే విద్యుత్ ఆదా అయి ఖర్చు మిగిలి వాడకందారులకు చౌకగా లభిస్తుంది. ఇంతకంటే కావాల్సిందేమీ లేదు. అయితే చంద్రబాబు యధావిధిగా ఇక్కడ కూడా రాజధానికే పరిమితమయ్యారు. అమరావతిలో సోలార్ సౌకర్యాల గురించే ఉపన్యాసమిచ్చారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ తదితర మిగతా ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలు ఆయనకెందుకో వెంటనే స్ఫురించటం లేదు. టెక్సాస్‌లో మాట్లాడుతూ, సోలార్ విద్యుత్ శ్మశానాలను ఏర్పాటు చేస్తామని, ఆ తర్వాత 2030 నాటికల్లా ఏపీలో డ్రైవర్‌లేని కార్లు పరిగెడుతుంటాయని చెప్పుకొచ్చారు. దీంతో అక్కడున్న తెలుగువారు కొంతమంది ముఖాలు చూసుకున్నారు. ఏపీలో మౌలిక వసతుల గురించి, యాంత్రీకరణ, కృత్రిమ మేధ వల్ల తగ్గే ఉపాధి అవకాశాలను పెంచటానికి ప్రత్యామ్నాయ చర్యల గురించి చెప్పి ఉంటే ప్రవాస తెలుగువారికి కొంత అర్థవంతమైన సందేశాన్ని బాబు ఇచ్చి ఉండేవారేమో!

చంద్రబాబు చెప్పిన మొదటి అంశానికే మళ్లీ వద్దాం. 'అమెరికాలో ఎక్కువ ఆదాయం సంపాదించేవారు భారతీయులు. అందులోనూ ముఖ్యంగా తెలుగువారు. మిమ్మల్ని చూస్తే నాకు గర్వంగా ఉంది. మీలో ఒక్కొక్కరూ ఒక్కో బాహుబలి కావాలి'..

అమెరికాకి వీరంతా ఎలా వచ్చారో చంద్రబాబు ఆలోచిస్తే, ఏపీ ముఖ్యమంత్రిగా తాను చేయాల్సిన బాధ్యత ఏమిటో ఆయనకు స్పష్టంగా గోచరించేది. తెలివితేటలు, విజ్ఞానం గలవారు, డబ్బులు దండిగా ఉన్నవాళ్లు, అక్రమంగా ఏదోవిధంగా ప్రవేశించినవారు.. ఇలా మూడు రకాలవారు ఏపీ (ఇండియా) నుంచి అమెరికాలో ఉన్నారు. మూడోరకంవారికి ఎప్పటికైనా సమస్యలు తప్పవుగానీ, మొదటి రెండు రకాలవారికి ఎప్పుడూ ఢోకా ఉండదు. కానీ మొదటి రెండు రకాల కేటగిరీలో అవకాశాలు ఆంధ్రప్రదేశ్‌లో ఎంతమందికి వస్తాయి?

ప్రకృతో, దేవుడో ప్రసాదించిన తెలివితేటల్ని వికసింపచేసుకుని అమెరికానో, మరో దేశమో వెళ్లి స్థిరపడటం లేదా స్వదేశంలోనే ఉన్నతస్థాయికి ఎదిగి బాహుబలులు కావటం ఈరోజు ఏపీలో, ఇండియాలో ఎంతమంది పిల్లలకు సాధ్యం? తెలివితేటల్ని వికసింపచేయగల చదువును అందుకోవటం, విదేశాలకు వెళ్లగల స్థాయిలో ఐదు మిలియన్ డాలర్లను చెల్లించటం డబ్బున్నవారి పిల్లలకి మాత్రమే కాదు, ఎవరికైనా సాధ్యమే అని చంద్రబాబు చెప్పగలరా? అంటే, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తరచూ చెబుతున్నట్టు.. కేవలం ఏ తల్లి గర్భాన పుట్టారు అనే దాని బట్టే ఈ దేశంలో కోట్లాదిమంది బిడ్డల భవిష్యత్తు నిర్ణయమై పోతుంది. నూటికి 80 మంది పిల్లలు డబ్బున్నవారి విజయగాథల్ని వింటూ, చూస్తూ అవకాశాల కోసం కలలుకనటమే తప్ప వాటిని సాకారం చేసుకునే అవకాశాలు దాదాపు లేవు. అందుకు తగ్గ విద్య, వైద్య వ్యవస్థలు మనదేశంలో లేవు. వాటిని సాధించటానికి, ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, ఆరోగ్యాలను అందించటానికి ఏ అధికారంలేకుండానే జేపీ అంత కష్టపడుతుంటే, అధికారం ఉన్న చంద్రబాబు కనీసం వాటి గురించి ప్రస్తావించ లేదు. అమెరికాలో ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చారు.

పాఠశాల విద్యా ప్రమాణాలలో ఏపీ ఇంకా దిగజారి 17వ

స్థానానికి చేరిందని తాజాగా నీతి ఆయోగ్ కూడా హెచ్చరించింది. మరి అమెరికా స్థాయికి ఆంధ్రప్రదేశ్ రావటమనేది మాటల్లో తప్ప చేతల్లో సాధ్యం కాదని తెలుస్తున్నా, ఎందుకు అబద్ధాలతో మభ్యపెట్టాలని చూస్తున్నారు చంద్రబాబూ? విద్య అంటే సిలబస్‌లు, భవనాలు, ర్యాంకుల పరీక్షలు మాత్రమే కాదు.. వాటన్నింటినీ మించి జీవనోపాధికి, సమాజానికి, సానుకూల సృజనాత్మక ఆలోచనాశక్తికి మూలాధారం. కనీసం, అమెరికా వీసాలు తిరస్కరించినవారికి ఉపాధిని కల్పించగల శక్తి కూడా ఏపీలో లేదిప్పుడు.

అమెరికా తదితర దేశాలలో పర్యటించిన, పర్యటించబోయే రాజకీయ నాయకులు 'అమెరికాకి దీటుగా భారత్‌ని తయారుచేస్తాం' అనడం మామూలుగా మారింది. యాభై ఏళ్లుగా ఈ మాటలు వింటూనే ఉన్నాం. జరిగింది, జరుగుతున్నది చూస్తూనే ఉన్నాం. 'మార్చేస్తాం' అంటూ గొప్పగా చెబుతుంటారు, అందుకు విధానాలు ఉండవు కాబట్టి ఆచరణ ఏమాత్రం ఉండదు. వట్టి నోటిమాటలు, నినాదాలతో ఏం లాభం? మనదేశం స్థాయి జనాభాగల పొరుగుదేశం చైనా కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుని, మనకంటే మెరుగైన వికేంద్రీకరణతో పురోభివృద్ధిని సాధిస్తోంది. మనకంటే చిన్న చిన్న దేశాలు సైతం చక్కని ఫలితాలు సాధిస్తూ ప్రగతి సాధిస్తున్నాయి. మనం మాత్రం పసలేని వాగ్దానాలు చేస్తూ, టెక్నాలజీయే సర్వరోగనివారిణి అని భ్రమింప చేస్తున్నాం. నోటి వాచాలతకి నవ్వుకునేవారి సంఖ్య పెరుగుతోందని గ్రహించటం మంచిది. మనం ఏ అగ్రదేశాలతోనూ పోటీపడనక్కర్లేదు. వాటిని ఆదర్శంగా తీసుకుంటే చాలు. చట్టబద్ధపాలన, మౌలికవసతులు, అందరికీ మంచి విద్య, ఆరోగ్యం, ఉపాధి, స్థానికంగా రోజువారీ పనులు వెంటనే పూర్తయ్యే ఏర్పాట్లు వంటి కనీస అంశాలలో ముందు మనం మెరుగుపరచుకోవాలి. ప్రజల్ని యాచకుల్లా, ఓటు వేసే యంత్రాల్లా కాకుండా.. తలెత్తుకుని బతికే మనుషుల్లా చూడాలి. లెక్కలేనన్ని సారా దుకాణాలు తెరిచి మద్యాన్ని ఆదాయమార్గం చేసుకోవటం వంటి విధానాలకు స్వస్తి చెప్పాలి. ప్రజల్లో చాలామందికి తమ ఆకాంక్షలను ఓటు ద్వారా వ్యక్తం చేయటం ఇంకా తెలియకపోవచ్చు. కానీ ప్రజలు కోరుకుంటున్నది ఇలాంటి పరిపాలననే. ఇది మరచిపోతే మన దేశానికి వచ్చేవి పేరుప్రఖ్యాతులు కావు, అవమానాలు. మనం అగ్రరాజ్యం కావటం అలా ఉంచి, ఓ సాధారణ దేశంగా కూడా మనుగడ సాగించటానికి చాలా కష్టపడాల్సి ఉంటుంది.

రాష్ట్ర విభజన తర్వాత తన తొలి యూఎస్ పర్యటన ఇది అని చంద్రబాబు చెప్పుకున్నారు. కూడా వచ్చిన ఆయన పీఆర్‌వో పరకాల ప్రభాకరైతే ఎన్నడూ పేరు కూడా వినని అమెరికా సీఈవోల స్ఫూర్తిని గురించి ఇంకా ఘనంగా చెప్పుకొచ్చారు. స్వదేశీ పాలనను మెరుగుపరచలేని విదేశీ పర్యటనలు, ఉపన్యాసాలు వృథా. నిజంగా అమెరికా పర్యటనను చంద్రబాబు అండ్ కో అంత ముఖ్యమైనదిగా భావిస్తే, తెలుగువారు ఒకొక్కరిని ఒక్కో బాహుబలిగా మార్చాలనుకుంటే.. అమరావతిని పక్కనపెట్టి రాష్ట్రవ్యాప్తంగా ముందు కనీసం విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల మీద అత్యంత సీరియస్‌గా దృష్టి పెట్టాలి. ❍

# జీడీపీకి నోట్ల రద్దు దెబ్బ

ఆర్థికాభివృద్ధిపై పెద్ద నోట్ల రద్దు ప్రభావం ఏమాత్రం ఉండదని మోదీ ప్రభుత్వం ఎంతగా ప్రచారం చేసుకున్నా వాస్తవం అందుకు విరుద్ధంగా ఉందని వివిధ పరిణామాలు స్పష్టంచేస్తున్నాయి. ఈ ఏడాది మార్చి 31వ తేదీతో ముగిసిన 2016–17 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయరంగం అద్భుతమైన వృద్ధిని (4.9శాతం) సాధించినా ఆర్థికాభివృద్ధి రేటు గణనీయంగా క్షీణించింది. 2016–17 మొత్తం మీద ఆర్థికరంగం వృద్ధి రేటు 7.1శాతానికి పడిపోయింది. ఇది మూడేళ్ల కనిష్టస్థాయి. ఈ క్షీణతతో ప్రపంచంలో త్వరితగతిన వృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థ హోదాను భారత్ కోల్పోయింది. గత ఏడాది నవంబర్ 8వ తేదీ నుంచి ప్రభుత్వం 500, 1000 రూపాయల నోట్లు రద్దు చేసిన ప్రభావం వల్ల జనవరి–మార్చి త్రైమాసికంలో వృద్ధిరేటు 6.1శాతానికి క్షీణించి మొత్తం ఆర్థికసంవత్సరాన్నీ ప్రభావితం చేసింది. క్యూ4లో వృద్ధి రేటు వెనుకంజలో ఉన్న చైనా కంటే తీసికట్టుగా ఉంది. చైనా ఆ త్రైమాసికంలో 6.9శాతం వృద్ధిని సాధించింది. మౌలిక రంగాల్లో వృద్ధి మందగించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో 2.5శాతానికి పరిమితమైంది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో 8,7శాతం వృద్ధిని ఈ కీలక ఎనిమిది రంగాలు (బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు సిమెంటు, విద్యుదుత్పత్తి) నమోదు చేశాయి. బొగ్గు, సిమెంటు, ముడి చమురు ఉత్పత్తుల తగ్గుదల మందగమనానికి కారణమైంది. వ్యవసాయ రంగంలో తాజా అంచనాల ప్రకారం ధాన్యం ఉత్పత్తి 10.91 కోట్ల టన్నులు, గోధుమ ఉత్పత్తి 9.74కోట్ల టన్నులు, పప్పుధాన్యాలు 2.24 కోట్ల టన్నులు ఉత్పత్తి అయ్యాయి. దేశ ప్రజల సంపన్నతకు గీటురాయి అయిన తలసరి ఆదాయం తలసరి ఆదాయం రూ.1,03,219కి పెరిగింది. 2011–12 ధరల ప్రకారం స్థూల జాతీయాదాయం 112.46లక్షల కోట్ల రూపాయల నుంచి 120.35లక్షల కోట్ల రూపాయలకు చేరింది. ❍

# ఏపీ: అప్పుల్లో ఉన్న జోరు ఆదాయంలో లేదు!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తలసరి ఆదాయంలో వెనకబడి అప్పుల్లో మాత్రం పెరుగుతోందని రాష్ట్ర ప్రణాళికా శాఖ నివేదిక వెల్లడించింది. పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ, తెలంగాణ తలసరి ఆదాయంలో ఏపీకన్నా ముందున్నాయి. తెలంగాణ తలసరి ఆదాయం ఆంధ్రప్రదేశ్ కన్నా రూ. 20వేలు ఎక్కువగా ఉంది. ఏపీ తలసరి ఆదాయం రూ. 1,22,376గా ఉంది. మరోవైపు తలసరి అప్పు మాత్రం పెరిగిపోతూ ఉంది. తలసరి వ్యయం అప్పు కన్నా తక్కువగా ఉంది. రూ. 1,61,097తో తలసరి ఆదాయంలో కృష్ణా జిల్లా ముందంజలో ఉండగా, రూ. 94,118తో శ్రీకాకుళం చిట్టచివరన ఉంది.

2016–17 ఆర్థిక ముఖచిత్రం ప్రకారం ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిమాణం రూ. 6.99లక్షల కోట్లుగా ఉంది. రూ. 22.68లక్షల కోట్ల ఎకానమీతో మహారాష్ట్ర, రూ. 13.39లక్షల కోట్లతో తమిళనాడు, రూ. 11.33లక్షల కోట్ల ఎకానమీతో కర్ణాటక ముందు వరసలో ఉన్నాయి.

### నీతి ఆయోగ్ సర్వేలో ఏపీకి 17వ స్థానం

పాఠశాల విద్య కనీస సామర్థ్యాల సూచిక సర్వే–2017 ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలో 17వ స్థానంలో నిలిచినట్టు నీతి ఆయోగ్ తెలిపింది. ప్రభుత్వ బడులలో మూడు, ఐదు తరగతి చదువుతున్న విద్యార్థుల్లో చాలామంది ఒకటో తరగతి పుస్తకాలను కూడా చదవలేని పరిస్థితుల్లో ఉన్నారు. 2014తో పోలిస్తే 2016కు మూడు జిల్లాలు మినహా మిగతావాటిల్లో ఇలాంటి విద్యార్థులు పెరగడం ఆందోళనకరం. విశాఖ, శ్రీకాకుళం, చిత్తూరు మినహా రాష్ట్రమంతా ఈ నెగెటివ్ గ్రోత్ కనిపిస్తోంది. కృష్ణా జిల్లాలో 2014లో ఒకటో తరగతి పుస్తకాలను చదవగలిగినవారు 71.7శాతం మంది ఉండగా.. 2016కు వచ్చేసరికి అది 51.2శాతానికి పడిపోయింది.

### జిల్లాల ఆర్థిక ముఖచిత్రం

రాష్ట్రంలో వృద్ధి రేటులో ఐదు జిల్లాలు ప్రగతిలో నిలిచాయి. ఇందులో రెండు జిల్లాలు అధిక వృద్ధి రేటు, ఆదాయంలో అధిక వాటా సాధించాయి. కృష్ణా, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, గుంటూరు జిల్లాలు అధిక ఆదాయం అందించే సామర్థ్యం గల జిల్లాలుగా నిలిచాయి. రాష్ట్ర జీవీఏ (గ్రాస్ వాల్యూ యాడెడ్)లో వీటి వాటా 52.9శాతంగా ఉంది. వృద్ధి రేటులో తొలిస్థానం సాధించిన పశ్చిమ గోదావరి జిల్లా.. రాష్ట్ర ఆదాయపు వాటాలో మాత్రం మూడవ స్థానంలో నిలిచింది. నెల్లూరు జిల్లా వృద్ధి రేటులో రెండవస్థానం దక్కించుకున్నా.. ఏడవ స్థానానికి పరిమితమైంది. వృద్ధిరేటులో మూడో స్థానంలో నిలిచిన కృష్ణా జిల్లా (12.43) రాష్ట్రానికి అధిక ఆదాయం సాధించి పెట్టే మొదటి జిల్లాగా (12.06) ఉంది.




వ్యవసాయ ఆదాయంలో పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలు తొలి మూడు స్థానాలలో నిలిచాయి. పారిశ్రామిక రంగ ఆదాయంలో విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలు తొలి మూడు ర్యాంకులలో ఉన్నాయి. సేవారంగంలో విశాఖ తొలిస్థానంలో ఉండగా, కృష్ణా, గుంటూరు జిల్లాలు తరువాతి స్థానాల్లో ఉన్నాయి.

### వ్యవసాయాన్ని మించిన ఉద్యానం

వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉద్యానం దూసుకెళ్తోంది. 2016–17 సంవత్సరంలో ఈ రంగం మొత్తం మీద 14.03శాతం వృద్ధిరేటు అందుకుంది. గతేడాది కంటే 5.90శాతం అదనంగా నమోదు చేసింది. వర్షాభావ పరిస్థితులు వ్యవసాయ ఆదాయంపై ప్రభావం చూపడంతో వెనకబడింది. ఇందులో 21.46 వృద్ధి రేటు లక్ష్యంగా నిర్ణయించగా 2.03శాతం మాత్రమే వచ్చింది. ఉద్యానపంటలకు 16.22శాతం లక్ష్యంగా నిర్ణయిస్తే 16.79 సాధించింది. మునుపెన్నడూ లేనివిధంగా వ్యవసాయ ఆదాయం కంటే రూ. 2,398కోట్లు అదనంగా వచ్చింది. పశుసంవర్థకంలో 12.18శాతం, ఆక్వాలో 30.09శాతం వృద్ధి సాధించడం విశేషం. ❍

# పుష్కరాల ఖర్చు, పనుల నాణ్యత, చర్యలపై చంద్రబాబు ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి

- కూసంపూడి శ్రీనివాస్,
లోక్‌సత్తా పార్టీ ఏపీ అధికార ప్రతినిధి



**2015, 2016** గోదావరి, కృష్ణా నదుల పుష్కరాల సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం చేసిన వేల కోట్ల ఖర్చు, ఆర్భాటం చాలామందికి గుర్తుండే ఉంటుంది.

పుష్కరాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోంది కనుక ఈ కార్యక్రమానికి అందరూ తప్పక రావాలని కృష్ణా పుష్కరాలు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర మంత్రులు, ఉమ్మడి రాష్ట్ర గవర్నర్‌ను కలిసి ఆహ్వానించారు. రాష్ట్ర మంత్రులు కూడా రాష్ట్రానికి సంబంధించిన సినీ, రాజకీయ ప్రముఖులందరినీ కలిసి ఆహ్వాన పత్రికలు అందచేశారు. ఈ హడావుడి చూసినవారికి కృష్ణా నదికి ఇవే తొలి పుష్కరాలా అన్న అనుమానం కలిగింది. భక్తుల సంగతి ఎలా ఉన్నా తాను మళ్లీ అధికారంలో వచ్చాక వచ్చిన గోదావరి, కృష్ణా పుష్కరాలు చంద్రబాబుకు అందివచ్చిన అవకాశంగా మారాయి. అధికారిక లెక్కల ప్రకారం రూ. 1,143 కోట్లతో 156 ఘాట్లు, 59 పుష్కర ప్రాంతాలతో కృష్ణా, గుంటూరు, కర్నూలు జిల్లాల్లో చేపట్టిన పనులను చక్కబెట్టటంలో చంద్రబాబు ఈవెంట్ మేనేజర్‌లా తలమునకలయ్యారు. నారద తుంబురాది దేవగాయకులు, దేవేరుల సమేత ఇంద్రాది దిక్పాలకులు, త్రిమూర్తులు, ముక్కోటి దేవతలు ఈ పుష్కర స్నానమాచరిస్తారని ప్రచారం చేయడానికి ప్రవచకులతో ముందస్తు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. భక్తి ప్రచారం హోరెత్తుతుండగా.. భక్తులకు సౌకర్యాలు కల్పించే పేరుతో తమ వర్గీయులకు, అనుయాయులకు కాంట్రాక్టు పనులు కట్టబెట్టారు. ఎక్కడా రాజీ పడకుండా కనీసం టెండర్లు పిలవకుండా ఇంచుమించు రూ. 168 కోట్ల విలువైన ఘాట్ పనులను సోమా ఎంటర్‌ప్రైజెస్, సూర్య కన్‌స్ట్రక్షన్స్, విన్ లెద్ తదితర సంస్థలకు ఇవ్వటంతోపాటు ప్రొటోకాల్, చేతి ఖర్చుల నిమిత్తం ఏకంగా రూ. 30కోట్లు ఆర్థికశాఖకు ఆదేశాలిచ్చి మరీ ముఖ్యమంత్రి విడుదల చేయించారు. కృష్ణా పుష్కరాలకు వచ్చే భక్తులకు విజయవాడలో కృష్ణా స్నానం, పట్టిసీమ ద్వారా వచ్చే గోదావరి నీటితో గోదావరి స్నానం, ఈ రెండూ కలిసే చోట సంగమ స్నానం చేయొచ్చని, ఇదొక అద్భుత అవకాశమని పండితుల చేత చెవులు చిల్లులు పడేలా చెప్పించారు.

మరోపక్క 2015 జులై 14 నుంచి జరిగిన గోదావరి పుష్కరాలు 2016 ఆగస్టు 11తో ముగిసినా, ఇంచుమించు రూ. 1800కోట్లతో నిర్వహించిన గోదావరి పుష్కరాల తొలిరోజున జరిగిన తొక్కిసలాటలో 29 మంది చనిపోయిన ఘటనలో దోషులపై చర్యలు లేవు. జస్టిస్ సోమయాజులు నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ విచారణ వాయిదాల పర్వంతో సాగింది. మరణించినవారంతా పేద కుటుంబాలకు చెందినవారు కావటంతో విచారణలో నిర్లక్ష్యం ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం ఏమీ లేదని ప్రభుత్వం, ప్రభుత్వ నేతల నిర్వాకం ఏమీలేదనే విధంగా అధికారయంత్రాంగం నివేదికలు ఇచ్చింది. ఉత్తరాదిన జరిగే కుంభమేళాకు తీసిపోని విధంగా గోదావరి పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నామంటూ కేవలం ప్రచారానికే ఇంచుమించు రూ. 100కోట్లు ఖర్చు చేశారు. ఆ ఆర్భాటమే 29మంది పేద, మధ్యతరగతి కుటుంబాలను విషాదంలోకి నెట్టింది.

అంతంత ఖర్చు పెట్టి చేసిన పనులు ఏమన్నా నాణ్యతతో ఉన్నాయో ఆలోచించారా?.. గోదావరి సందర్భంగా ఏమాత్రం నాణ్యత లేకుండా పనులు చేయడం వల్ల.. సంవత్సరం గడవక ముందే రోడ్లు కుంగిపోవడం, పైప్‌లైన్లు లీకవడం, ఘాట్లు బీటలు వారడం మొదలైంది. వాటిల్లో చాలామట్టుకు పూర్తిస్థాయిలో దెబ్బతిని మళ్లీ మొత్తం ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. నాసిరకం

పనుల వల్ల కృష్ణా పరివాహక ప్రాంతంలోనూ అనేక ఘాట్లు ధ్వంసమయ్యాయి. ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న రాజధాని అమరావతిలోనే లీకవుతుంటే, పుష్కరాల గురించి బాధపడటమేంటి అని అమాయకంగా అనుకుందామా, మీ సొంత సొమ్మయితే ఇంత నిర్లక్ష్యంగా వృథా చేస్తారా అని మేలుకొని చంద్రబాబు అండ్ కోని ప్రశ్నిద్దామా?

**ముఖ్యమంత్రి అంటే ఈవెంట్ మేనేజరా?**

**మత విశ్వాస కార్యక్రమాల్ని నిర్వహించడం ప్రభుత్వ బాధ్యతా?**

అలాగే అసలు ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ప్రభుత్వ బాధ్యతా? అన్న చర్చను ఇప్పటికైనా చేద్దాం. తెలుగు పాలకులకే కాదు, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి కూడా వర్తించే చర్చ ఇది.

ప్రభుత్వం తాను చేయాల్సిన చట్టబద్ధపాలన, మౌలిక వసతుల కల్పన, అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించటం వంటి వాటిని వదిలేసి పుష్కరాల వంటి వాటిని ఈవెంట్లుగా మలుస్తూండటమంటే.. ప్రజల్ని పక్కదోవ పట్టిస్తున్నారనే అర్థం. ప్రజాప్రయోజనాలకు విఘాతం కలిగించే పాలన అని అర్థం. ఆధునిక ప్రజాస్వామ్య ప్రభుత్వం పుష్కరాలప్పుడు ఏం చేయాలి? ప్రజలకు రక్షణ, రక్షిత తాగునీరు, రవాణా సౌకర్యాలు వంటి ఏర్పాట్లకు పరిమితం కావాలి. అవి కూడా ముఖ్యమంత్రి స్థాయిలో చేయనక్కర్లా. సంబంధిత విభాగాల మంత్రులు, కార్యదర్శులు, అధికారులు చూసుకోవాలి. కానీ గోదావరి, కృష్ణా పుష్కరాలను ఏపీ ప్రభుత్వం నిర్వహించిన తీరు ఆధునిక పాలనా సూత్రాలన్నిటినీ తుంగలో తొక్కి ప్రజలను భ్రమల్లోకి నెట్టింది.

పుష్కరాలనేవి ఒక మతంవారు ఎన్నో శతాబ్దాలుగా నిర్వహించుకునే సాధారణ ఆచారం. ఎక్కడో మహారాష్ట్రలోని మహాబలేశ్వర్ వద్ద పుట్టి పెరిగిన కృష్ణా నది మూడు రాష్ట్రాల గుండా 1,300 కిలోమీటర్లు ప్రవహించి ఆంధ్రప్రదేశ్‌లోని హంసలదీవి వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. ఇతర రాష్ట్రాలు కూడా ఈ పుష్కరాలను జరుపుకుంటాయి. కానీ వ్యక్తిగత ప్రచారానికి, రాజకీయ అవసరాలకి వెగటుపుట్టే స్థాయిలో పుష్కరాలను చంద్రబాబు ఉపయోగించుకున్నారు. కృష్ణా పుష్కరాల సమయంలో విజయవాడ ప్రాంతంలో మాంసం అమ్మకాలపై సైతం ముఖ్యమంత్రి నిషేధించారు. మాంసం అమ్మకాల వల్ల నది నీరు కలుషితమవుతుందట. కేవలం మాంసం అమ్మకాల మీదే బతికే చిరువ్యాపారుల పరిస్థితేమిటో కూడా ఆయన ఆలోచించలేదు. మరోపక్క మద్యం అమ్మకాలపై మాత్రం ఎటువంటి నిషేధమూ విధించలేదు. ఎంత దశ-దిశ




లేని పాలన ఇది! కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలు, ప్రచార ఆర్భాటం, పనుల పేరుతో కోట్లు దండుకోవటం తప్ప పుష్కర ఆర్భాటాల సారాంశం ఏమిటి? అధికారులు రొటీన్‌గా నిర్వహించాల్సిన పనులను తానే స్వయంగా భుజాలపై ఎత్తుకుని నిర్వహిస్తున్నట్టు నటించడానికిచ్చిన ప్రాధాన్యతను రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించటం, ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలు, ఇతర వెనకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయటం మీద చంద్రబాబు పెట్టలేదు. ఈ క్రమంలో మూఢనమ్మకాలను సైతం ప్రోత్సహించటానికి, ప్రేరేపించడానికి ముఖ్యమంత్రి వెనుకాడలేదు. కృష్ణా, గోదావరి పుష్కరాల ఖర్చు, పనుల నాణ్యత, అక్రమాలకు పాల్పడ్డవారిపై చర్యలను ప్రజలకు తెలియచేస్తూ ఏపీ ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలి.

చంద్రబాబులాగానే తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు కూడా ఆధ్యాత్మికతకు, మత విశ్వాసాలకు తేడా లేకుండా చేస్తున్నారు. అందులో ప్రభుత్వాన్ని కలగలుపుతున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చేయకూడని రీతిలో వ్యవహరిస్తున్నారు. వీరిద్దరినీ చూస్తుంటే నార్ల మాటలు గుర్తుకొస్తున్నాయి.. ఢిల్లీలో కొలువై ఉన్న అధిష్టానానికి జోహుకుం అంటున్నందున ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డిపై విమర్శలు చేస్తూ కొన్ని దశాబ్దాల క్రితం ప్రముఖ సంపాదకుడు నార్ల వెంకటేశ్వరరావు తన సంపాదకీయంలో ఘాటు వ్యాఖ్యలు చేశారట. 'సీఎం అంటే చీఫ్ మినిస్టర్ కాదు.. చెప్పులు మోసేవాడు' అని రాశారట. ఇప్పుడు ఈవెంట్ మేనేజర్లలా, మత ప్రచారకుల్లా మారిన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల్ని చూస్తే నార్ల ఏమనేవారో?

చంద్రబాబు, కేసీఆర్ తమ కేంద్రీకృత పాలనను, ఈవెంట్ మేనేజ్‌మెంట్ పనితీరుని, మత విశ్వాసాలలో పాలనను జొప్పించే సంస్కృతిని వీడి నాగరిక ప్రజాస్వామ్య ముఖ్యమంత్రుల్లా వ్యవహరించకపోతే చరిత్ర పుస్తకాల్లో ఫుట్‌నోట్స్‌కే పరిమితమైపోతారు. ❍

# సమాచారహక్కుకు ఏదీ దిక్కు?

- శైలేష్ గాంధీ,
కేంద్ర సమాచార మాజీ కమిషనర్




## ఉదాసీనతే శాపం

ప్రస్తుతం సమాచార కమిషనర్లు ఎవరికీ తమ పని పట్ల ఉత్సాహం, అనురక్తి ఉన్నట్టు కనిపించదు. అందుకే వారి పనిలో నాణ్యత లోపిస్తోంది. వారి నుంచి ఎక్కువ పనినీ ఆశించలేకపోతున్నాం. 2011లో ఆరుగురు కేంద్ర సమాచార కమిషనర్లు 22,351 కేసులను పరిష్కరించగా, 2013-14లో ఎనిమిదిమంది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కమిషనర్లు కలిసి కేవలం 12,576 కేసులను మాత్రమే పరిష్కరించారు. వీరు సమాచార కమిషనర్ పదవులను పదవీ విరమణానంతరం లభించిన బరువు బాధ్యతలు లేని ఉద్యోగంగా పరిగణిస్తున్నారే తప్ప, అంకితభావం ప్రదర్శించడం లేదు. పారదర్శకతకు పట్టం కట్టడం లేదు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు విడిపోయి మూడేళ్లయింది. ఈ మూడేళ్లలో రెండు ప్రభుత్వాలూ వేర్వేరుగా పూర్తిస్థాయి సమాచార కమిషన్లను ఏర్పాటు చేసుకోలేకపోయాయి. ఒకరకంగా ఇది సమాచార హక్కు చట్టంలోని 15(1) సెక్షన్‌ను అతిక్రమించడమే. ప్రతి రాష్ట్ర ప్రభుత్వమూ అధికార గెజిట్ నోటిఫికేషన్ ద్వారా సమాచార కమిషన్‌ను నియమించాలని ఈ సెక్షన్ నిర్దేశిస్తోంది. వివిధ స్థాయిల్లో అవినీతికి అడ్డుకట్ట వేసి, పారదర్శక పాలనను పాదుగొల్పేందుకు- పౌరుల్లో ఆత్మవిశ్వాసాన్ని నెలకొల్పేందుకు ఆర్‌టీఐ భరోసా పలుకుతుంది. పన్నెండేళ్ల క్రితం (2005, అక్టోబర్ 12) ఆర్‌టీఐ చట్టం అమలులోకి వచ్చిన దరిమిలా ప్రజలు, ప్రజా ప్రతినిధుల సంబంధాల్లో గుణాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రజలే ఏలికలు. వారు ఎన్నుకునే రాజకీయ నాయకులు ప్రజాసేవకులు మాత్రమే. కానీ, 1950 నుంచి కొంతకాలం క్రితం వరకూ ప్రజలు తమకు నిజమైన సాధికారత ఉందని భావించిన సందర్భమే లేదు. సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చిన తరువాతే ప్రజలకు తమ అధికారాల గురించిన చైతన్యం ఏర్పడింది. నేడు ఆర్‌టీఐ చలవతో నిరుపేద రైతు సైతం పాలకుల, అధికారుల ఏకపక్ష నిర్ణయాలను ప్రశ్నించి, వారి లోగుట్టును బైటపెట్టాలని గట్టిగా డిమాండ్ చేయగలుగుతున్నాడు. ఏ స్థాయిలో అసమర్థత, నిరంకుశ పోకడ వ్యక్తమైనా నిలదీసి ప్రశ్నిస్తున్నాడు. క్రమంగా భాగస్వామ్య ప్రజాస్వామ్యం ఏర్పడి, స్వాతంత్ర్య సేనానులు ఆకాంక్షించిన స్వరాజ్యం దిశగా మెల్లగానైనా అడుగులు పడుతున్నాయి. ఈ పరిణామం భారత ప్రజాస్వామ్యాన్ని, పాలన తీరుతెన్నులను మెరుగుపరిచేదే అనడంలో సందేహం లేదు.

**నిబంధనలకు తూట్లు**

సమాచార హక్కును నీరుగార్చేందుకు పాలకుల స్థాయిలో రకరకాల ఎత్తుగడలు సహజమే. ప్రభుత్వ యంత్రాంగానికి ఆర్‌టీఐ అంటే దాదాపుగా గిట్టదు. పారదర్శకత గురించి ఉపన్యాసాలు చెప్పే అధికారులు తమ దాకా వస్తే మాత్రం తలుపులు బిడాయించుకుంటారు. తమకు ఏ నియమాలు, నిబంధనలు వర్తించకూడదనుకుంటారు. ఈ స్వార్థమే ఆర్‌టీఐకి సొంత భాష్యాలు చెప్పుకునే దురవస్థను నేడు మన ముందుకు తెచ్చింది. పార్లమెంటు ఆమోదించిన సమాచార హక్కు చట్టం స్ఫూర్తికి సరిగ్గా విరుద్ధమైన భాష్యాలవి. ప్రపంచంలోని అత్యుత్తమ సమాచార చట్టాల్లో భారత ఆర్‌టీఐ అయిదో స్థానంలో నిలుస్తున్నా- పారదర్శకతలో మనదేశం 65వ స్థానంలో ఉండటమే ఇందుకు నిదర్శనం. చట్టం పకడ్బందీగా రూపొందించినా దాని అమలు నాసిరకంగా ఉంటోందని నిరూపిస్తున్న వాస్తవమిది. భారత రాజ్యాంగంలోని 19 (1) (ఏ) అధికరణ పౌరులకు భావ ప్రకటన స్వేచ్ఛను ఇస్తున్నా- ఆర్‌టీఐ ఉద్యమకారులు దాన్ని వినియోగించుకుంటే ఏలినవారు రుసరుసలాడుతున్నారు. భావ ప్రకటన హక్కును వినియోగించుకునే స్వేచ్ఛ పౌరులకు ఉందని అంగీకరిస్తున్న నాయకులు కూడా దాన్ని తమ లోపాలు బహిర్గతం చేసేందుకు వినియోగిస్తే సహించలేకపోతున్నారు. సమాచార హక్కు చట్టానికి ఎదురవుతున్న ముప్పు ఇదే!

ఆర్‌టీఐ పూర్తిస్థాయిలో పనితనం చూపించకుండా నిలువరించే ప్రయత్నాలు జరిగాయి. సమాచార కమిషనర్లను సకాలంలో నియమించకపోవడం, సమర్థులను ఆ పదవికి ఎంపిక చేయకపోవడం, చట్టనిబంధనలను బాహాటంగా ఉల్లంఘించడం




వంటి ఎత్తుగడలను కొంతకాలంగా చూడాల్సి వచ్చింది. పారదర్శకత గురించి మాటలు చెప్పడంతో సరిపెట్టకుండా కచ్చితమైన అర్హతలు ఉన్నవారిని, సకాలంలో నియమించేందుకు ప్రయత్నిస్తే బాగుంటుంది. ఏడాదికి నిర్దిష్ట సంఖ్యలో దరఖాస్తులు పరిష్కరించాలని సమాచార కమిషన్లు ప్రతిన పూనాలి. వీలును బట్టి ఆ సంఖ్యను పెంచుకుంటూ పోవాలి. సమాచార కమిషనర్ల నియామకానికి కొలమానంగా తీసుకునే అర్హతలను ప్రజలకు వివరించాలి. కమిషనర్ల నియామకాల్లో ప్రజాప్రయోజనం తప్ప మరే మతలబూ లేదన్న విషయాన్ని జనబాహుళ్యానికి వెల్లడించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

సమాచార కమిషనర్ల పనితీరును ఆరు నెలలకు ఒకసారి సమీక్షించాలి. రాబోయే రెండేళ్లలో అందే దరఖాస్తులను, ఫిర్యాదులను అంచనా వేసి- వాటిలో ఎన్నింటిని పరిష్కరించేందుకు అవకాశం ఉందో ముందే ఉజ్జాయింపుగా సూచించాలి. సమాచార కమిషనర్ పదవీ విరమణ చేసేలోపు ఎన్ని దరఖాస్తులను స్వీకరించి పరిష్కరించగలరన్న విషయాన్ని విశదపరచాలి. ఈ అంశాలను సమాచార కమిషన్ 'వెబ్‌సైట్'లో ప్రచురించాలి. ఇచ్చిన హామీలను నెరవేర్చగల సామర్థ్యం ఉన్నవారినే కమిషనర్లుగా నియమించాలి. ఎంతమంది సమాచార కమిషనర్లు అవసరమవుతారో తేల్చుకుని ఆరు నెలల ముందే ఈ విషయాన్ని ప్రకటించాలి. ఆ పదవికి భిన్నరంగాల్లో సుప్రసిద్ధులు దరఖాస్తు చేసుకోవచ్చు లేదా ప్రభుత్వమే వారిని "నామినేట్" చేయవచ్చు. అలా కాని పక్షంలో ఒక "సెర్చ్ కమిటీ"ని నియమించి సమాచార కమిషనర్ పదవికి కొందరు అభ్యర్థుల పేర్లను సూచించే బాధ్యతను కమిటీకి అప్పగించాలి. సమాచార కమిషనర్ పదవులకు మూడు రెట్లు అధిక సంఖ్యలో అభ్యర్థుల జాబితాను తయారుచేయాలి. దాన్ని సిద్ధం చేయడానికి పాటించిన పద్ధతులను, అభ్యర్థుల యోగ్యత నిర్ధారణకు అనుసరించిన ప్రమాణాలను కమిటీ సమావేశ రికార్డుల్లో నమోదు చేయాలి.

**ఎంపికలోనే లోపాలు**

సమాచార కమిషనర్ పదవులకు ఇంటర్వ్యూలను బహిరంగంగా నిర్వహించాలి. దానివల్ల అభ్యర్థుల దృష్టికోణం, నిబద్ధతలను పౌరులు, సమాచార సాధనాలు తమంతట తాము బేరీజు వేసుకోగలుగుతాయి. అనంతరం వారు అన్వేషక సంఘాని (సెర్చ్ కమిటీ)కి తమ అభిప్రాయాలు తెలియజేస్తారు. చివరకు సమాచార కమిషనర్ పదవుల్లో ఖాళీలకు రెండు రెట్లు అధికంగా అభ్యర్థులను అన్వేషక సంఘం సిఫార్సు చేస్తుంది. ఆ పేర్లను పరిశీలించి ఆర్‌టీఐ చట్టానికి అనుగుణంగా తుది నియామకం జరిపే బాధ్యతను ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, ఒక రాష్ట్రమంత్రితో కూడిన సంఘం నిర్వరిస్తుంది. సమాచార కమిషనర్లను ఎంత త్వరగా నియమిస్తే అంత సమర్థంగా ఆర్‌టీఐ చట్టం అమలవుతుంది. ఎవరైనా ఆర్‌టీఐ ఉద్యమకారుడిని ఒక సమాచార కమిషనర్‌గా నియమించడం ఎంతో అభిలషణీయం. అలాంటి ఉద్యమకారులకు తెలుగు రాష్ట్రాల్లో కొదవ లేదు. ఆర్‌టీఐ చట్ట నిబంధనలకు న్యాయ నిర్ణేతలు వక్రభాష్యాలు చెప్పడం మరో పెద్దలోపం. దీనివల్ల ఆర్‌టీఐ బలహీనపడుతోంది. కొన్ని రకాల వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని వెల్లడించనక్కర్లేకుండా ఆర్‌టీఐ చట్టం కొన్ని సందర్భాల్లో మినహాయింపులు ఇచ్చింది. కానీ, ఈ నిబంధనలను తప్పుగా వర్తింపచేస్తూ చట్టం స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నారు. ఇది పార్లమెంటు సమ్మతి లేకుండా ఆర్‌టీఐ చట్టాన్ని సవరించడం లాంటిది.

అన్ని ప్రభుత్వ విభాగాలు తమంతట తాము సమాచారం అందించాలని ఆర్‌టీఐ చట్టంలోని నాలుగో సెక్షన్ నిర్దేశిస్తున్నా, ఆ పని చిత్తశుద్ధిగా జరగడం లేదు. అలా జరిగితే ఆర్‌టీఐ కింద దరఖాస్తులు సమర్పించాల్సిన అవసరం తగ్గిపోతుంది. అవినీతి తగ్గి, ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుంది. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులూ పారదర్శక పద్ధతిలో కమిషనర్లను నియమించడానికి చొరవ చూపాలి. చట్టనిబంధనల ప్రకారం నియామకాలు జరపాలి. ఏడాదికి నిర్దిష్ట సంఖ్యలో కేసులను పరిష్కరిస్తామని కట్టుబాటు చాటేవారిని సమాచార కమిషనర్లుగా నియమించాలి. రెండు తెలుగు రాష్ట్రాల్లో సమాచార హక్కు రక్షణకు నిబద్ధత, అంకితభావం, నిజాయతీలతో పనిచేసే ఉద్యమకారులు చాలామంది ఉన్నారు. వారి నుంచి ఒకరిని ప్రధాన సమాచార కమిషనర్‌గా నియమించవచ్చు. రెండు తెలుగు రాష్ట్రాలు ఆర్‌టీఐ చట్టంలోని నాలుగో సెక్షన్‌ను కట్టుదిట్టంగా అమలుచేస్తే దేశానికే ఆదర్శంగా నిలుస్తాయి. పౌరుల నిఘాలో పరిపాలనా మెరుగుపడుతుంది!

(ఈనాడు సౌజన్యంతో) ❍

# ప్రభుత్వాల తీరే ప్రతిబంధకం: జేపీ

పాలనలో పారదర్శకత కొరవడితే అవినీతికి అడ్డూఆపూ ఉండదు. స్వాతంత్ర్యానంతర భారతంలో అత్యంత విశిష్టమైనదిగా పేరొందిన సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) 2005లో అమలులోకి వచ్చాక పాలనలో జవాబుదారీతనం గురించిన చర్చ ఊపందుకుంది. సహ చట్టం దేశంలో అద్భుత మార్పు సాధించిన దాఖలాలు లేకపోయినా– అవినీతి గ్రంథసాంగుల ఆటకట్టించగల సత్తా ఉన్న చట్టంగా మాత్రం పేరు తెచ్చుకొంది. అర్జీదారుకు సమాచారం అందించకుండా ఎలా ఎగ్గొట్టాలా అన్నదే ఇప్పటికీ అధికారస్వామ్యం లక్ష్యంగా ఉండటం, కమిషనర్ల నియామకాల్లో రాజకీయాలు పెద్దఎత్తున చొరబడటం వంటివి చట్టస్ఫూర్తిని దెబ్బకొడుతున్నాయి.

ఆర్‌టీఐపై ఇటీవల జాతీయ స్థాయిలో, తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ దాడులు తీవ్రతరమవుతున్న నేపథ్యంలో స్పష్టత కోసం.. చట్టం అమలులోని లోటుపాట్లపై సహ చట్టం ముసాయిదా కమిటీ సభ్యుడు, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ (ఆర్‌టీఐను అరుణారాయ్ వంటివారితో కలిసి జేపీయే రూపొందించారు. ఈ చట్టంలోని ప్రతి అక్షరం.. కామా, ఫుల్‌స్టాప్ సహా హైదరాబాద్‌లోని లోక్‌సత్తా కార్యాలయంలో జేపీ రాసినవే. ఆర్‌టీఐ కంటే కూడా శక్తిమంతమైన, విప్లవాత్మకమైన 'పౌర సేవల' చట్టం (రైట్ టూ సర్వీసెస్/సర్వీస్ గ్యారంటీ– ఆర్టీఎస్) కోసం కూడా 1998 నుంచి లోక్‌సత్తా పోరాడుతోంది)తో 'ఈనాడు ముందడుగు' ప్రతినిధి శైలేష్ నిమ్మగడ్డ 2010లో జరిపిన ముఖాముఖిని 'లోక్‌సత్తా టైమ్స్' పాఠకులకు అందిస్తున్నాం:

**ప్రశ్న: సమాచార హక్కు చట్టాన్ని తయారుచేసిన ముసాయిదా కమిటీ సభ్యులు మీరు. అప్పట్లో మీరు ఊహించిన రీతిలోనే చట్టం అమలవుతోందా?**

**జేపీ:** సమాజంలోని అన్ని రంగాలనూ స్పృశించేది సమాచార హక్కు (సహ) చట్టం. సహోద్యమంలో పాల్గొన్న మిగిలినవారు ఏం ఊహించారో తెలియదుకానీ, ఒక్కరోజులో అద్భుతాలు వస్తాయని మాత్రం నేను ఆశించలేదు. ప్రజల్లో చట్టంపై చైతన్యం, అవగాహన ఎంతమేరకు ఉంటే.. ఫలితాలూ అవే స్థాయిలో ఉంటాయి. అయితే.. విద్యార్థికుల్లో, యువతో సహ స్ఫూర్తి కనిపిస్తోంది. చాలా పత్రికలు కూడా కొద్దిమేరకే పనిచేస్తున్నాయి.

**(?) సహ చట్టం ప్రధాన లక్ష్యం పాలనలో పారదర్శకతను సాధించడం. అది ఎంతవరకు నెరవేరిందంటారు**

రాజకీయాల్లో కోట్ల రూపాయల నల్లధనాన్ని ఖర్చు పెడుతున్నప్పుడు ఎంత ప్రయత్నించినా పారదర్శకత రాదు. కాగితాల మీద ఉన్నది మన దాకా వచ్చినప్పుడే పారదర్శకత. కాగితాల మీద లేకుండానే ఎన్నో లావాదేవీలు జరుగుతున్నాయి. అవి ఎలా బయటికి వస్తాయి? ఎన్నికల సంస్కరణలను తీసుకువచ్చి, నల్లడబ్బును తగ్గించి (మన సమాజంలో 30 నుంచి 50శాతం వరకు ఉన్నది నల్లధనమే), అవినీతిని అంతం చేస్తేనే సహ చట్టానికి విలువ పెరుగుతుంది.

**(?) చట్టం నుంచి న్యాయవ్యవస్థకు ప్రత్యేక మినహాయింపులు ఇవ్వాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ అధ్యక్షులు,**




అందుకోసం అరుణా రాయ్ వంటి వారితో కలసి లోక్ సత్తా 2005లో సమాచార హక్కు (RTI) చట్టాన్ని సాధించింది.

**సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి కేజీ బాలకృష్ణన్ అంటున్నారు కదా..**

మనదేశంలో పారదర్శకత, జవాబుదారీతనం అన్నీ ఇంకొకరికే.. మనకు మాత్రం వర్తించకూడదనుకుంటారు. అధికార యంత్రాంగం, న్యాయవ్యవస్థ, ప్రభుత్వం అన్నీ ఇలాగే ఆలోచిస్తున్నాయి. సహ చట్టంలో న్యాయవ్యవస్థను కూడా చేర్చాలనే ఉద్దేశంతోనే పదజాలాన్ని చాలా జాగ్రత్తగా వాడాం. ప్రజల డబ్బుతో నిర్వహించే ఏ కార్యాలయమైనా 'పబ్లిక్ అథారిటీ'నే. సమాచారం ఇవ్వాల్సిందే. న్యాయస్థానాలూ దీన్ని అర్థంచేసుకుంటున్నాయి.

**(?) 'డ్రాఫ్ట్ కమిటీ' తయారు చేసిన చట్టంలో కేంద్రం మార్పులు చేసిందా?**

దాదాపుగా లేవు. సమాచార కమిషనర్ల ఎంపిక కమిటీపైనే

నేను గట్టిగా వాదించాను. కమిటీలో ప్రధానమంత్రి/ ముఖ్యమంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేతతోపాటు ప్రధాన న్యాయమూర్తి కూడా ఉండాలని చెప్పాను. ప్రతి దాంట్లోనూ న్యాయమూర్తులుంటే సాధ్యం కాదని, అప్పటి ప్రభుత్వం ఆ సూచనను పక్కనబెట్టింది. క్యాబినెట్ మంత్రికి స్థానమిచ్చింది.

**(?) సమాచార కమిషనర్ల ఎంపిక తీరులో మీరు గమనించిన అంశాలేమిటి**

కమిషనర్ల ఎంపికలో చాలా రాష్ట్రాలు చిత్తశుద్ధి కనబరచటం లేదు. అవినీతిపరులు, అసమర్థులు, ప్రభుత్వానికి పూర్తిగా దాసోహమనేవాళ్లు, జీవితాంతం జవాబుదారీతనానికి దూరంగా రహస్యాలను పాటించిన ప్రభుత్వాధికారులను కమిషనర్లుగా నియమిస్తున్నారు. పౌరసమాజం, పత్రికల నుంచి వచ్చే ఒత్తిడితో ఈ పరిస్థితిలో మార్పు వస్తుందని ఆశిద్దాం.

**(?) కమిషనర్ల ఎంపిక కమిటీలో ప్రధాన విపక్ష నేత పాత్ర నామమాత్రంగా ఉంటోంది గదా..**

రెండు పార్టీలను కూర్చోబెట్టామంటేనే అత్యున్నత ప్రమాణాలను ఆశిస్తాం. కొన్ని విషయాలు పార్టీ రాజకీయాలకు అతీతమైనవి, వ్యవస్థను బాగుచేయడానికి ఉద్దేశించినవి అని అర్థం చేసుకునే ఇంగితజ్ఞానం వారికుండాలి. లేకపోతే.. ఇది తప్పు అని నోరెత్తే శక్తి ప్రజలకుండాలి. సంఖ్యాబలంతోనే ప్రజాస్వామ్యం నడవదు. ప్రథమ ప్రధాని నెహ్రూకు సంఖ్యాబలం చాలా ఉంది. ఆయన దాన్ని ఉపయోగించుకుని ఉంటే.. దేశం ఇప్పుడిలా గట్టిగా నిలబడేది కాదు.

**(?) ముగ్గురు రాష్ట్ర సమాచార కమిషనర్ల పదవీకాలం ఈ నెలతో ముగిసిపోతోంది. కొత్తగా ఎలాంటివాళ్లు రావాలనుకుంటున్నారు**

నూటికి నూరుపాళ్లు విశ్వసనీయత ఉండాలి. నీతి, నిజాయతీ, నిర్భీతి ఉన్నవాళ్లు రావాలి. అలాంటివారు ప్రస్తుతం అరుదు. కానీ.. అసలు లేకుండా పోలేదు. విశ్రాంత అధికారులతో కమిషన్లను నింపకూడదు. పౌరసమాజం నుంచి వచ్చే వాళ్లు బాగా పనిచేస్తారు. ఇతర కమిషన్లను పరిశీలిస్తే ఇదే అర్థమవుతుంది. ముఖ్యంగా పత్రికారంగంలో ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వాలి. రహస్యాలను దాచకపోవడం, సమాచారాన్ని బైటపెట్టడం వారి వృత్తి ధర్మం. కమిషనర్లకు ఆ తత్వం ఉండాలి. రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేయాలనుకునే ప్రభుత్వాలు.. అర్భకులు, అనామకులు, తాబేదార్లను ఆ పదవుల్లో నియమిస్తున్నాయి. పాలకులు బుద్ధిపూర్వకంగా చేస్తున్న తప్పిదమిది.

**(?) సహ దరఖాస్తుదారులపై దాడులు జరుగుతున్నాయి. అడ్డుకోవడమెలా**

ప్రతి వ్యక్తికీ రక్షణ కల్పించడం సాధ్యం కాదు. బలమైన ఆధారాలుంటే రక్షణ కోరవచ్చు. దాడులకు గురవుతున్నవారిలో ఎక్కువమంది అవినీతిపై పోరాడాలన్న ఆవేశమున్నవారే. అయితే.. పోరాటంలోని ఒడుపులు మాత్రం వారికి తెలియవు. వాటిని తెలియజెప్పడానికి ఓ 'హెల్ప్‌లైన్' కావాలి. దాన్ని సమాచార కమిషన్లే నిర్వహించాలి. పత్రికలూ ఆ బాధ్యతను పంచుకోవచ్చు. అవినీతిపై పోరాడేవాళ్లకు దన్నుగా 'విజిల్ బ్లోయర్స్ ప్రొటెక్షన్ యాక్టు' (ప్రజావేగుల చట్టం)నూ తీసుకురాబోతున్నారు.

**(?) విజిల్ బ్లోయర్స్ ప్రొటెక్షన్ యాక్టు ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కేంద్ర విజిలెన్స్ కమిషన్‌ది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని సి.వి.సిగా నియమించారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడేవాళ్లకు దీంతో న్యాయం జరుగుతుందా**

కచ్చితంగా ఇది దురదృష్టమే. ఈ విషయంలో ప్రధానమంత్రి చేసింది చాలా తప్పు. ఆయనపై నాకు వ్యక్తిగతంగా గౌరవముండేది. సి.వి.సి నియామకంతో విశ్వసనీయత పోయింది. కేంద్ర విజిలెన్స్ కమిషనర్ సి.వి థామస్ గురించి నాకు వ్యక్తిగతంగా తెలియదు. ఆయన నియామకాన్ని వ్యతిరేకిస్తూ లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత సుష్మా స్వరాజ్ బలమైన వాదన చేశారు. 2జీ స్పెక్ట్రం కేసులో మంత్రి రాజాకు దన్నుగా ఉన్న వ్యక్తి, సి.వి.సిగా ఆ కేసుపై ఎలా విచారణ జరపగలరని ప్రశ్నించారామె. ఈ వాదనను ప్రధాని మన్నించాల్సి ఉంది. వ్యవస్థ అస్తిత్వంపై ప్రజలకు నమ్మకముండాలంటే కొన్ని సంస్థల్లో (న్యాయస్థానాలు, ఎన్నికల సంఘం, విజిలెన్స్, సమాచార కమిషన్లు..) నియామకాలు సక్రమంగా ఉండాలి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులపై బలమైన ఆరోపణలు వచ్చినప్పుడు లోక్‌సత్తా గట్టిగా పట్టించుకుంది. ఉన్నత న్యాయమూర్తుల నియామకాల కమిషన్ కోసం ప్రయత్నం ప్రారంభించింది. సుప్రీంకోర్టుపై ఏదో కోపంతో అలా చేయలేదు. న్యాయస్థానాలపై ప్రజల్లో నమ్మకం పోతే దేశంలో రాజ్యమేలేది అరాచకత్వమే.

**(?) రాజ్‌భవన్, రాష్ట్ర అసెంబ్లీ– సెక్షన్ 4(1)(బి) సమాచారాన్ని అందుబాటులో ఉంచడం లేదు. సాధారణ కార్యాలయాల సంగతి ఇక చెప్పనక్కర్లేదు. ఈ నేపథ్యంలో స్వచ్ఛందంగా సమాచారాన్ని అందజేయడమన్నది కలగా మిగిలిపోవలసిందేనా? ఈ పరిస్థితిలో మార్పు రావాలంటే ఏం చేయాలి**

చట్టం నిర్మాణంలో మేమొక పొరపాటు చేశాం. నేను దాన్ని అంగీకరిస్తున్నా. సహ చట్టం అమలును పర్యవేక్షించే అధికారాన్ని ఎవరికీ ఇవ్వలేదు. సమాచార కమిషన్లకు సైతం 'అప్పీలు అథారిటీ'నే ఇచ్చాం. ఈ విషయం అప్పట్లో మాకెందుకు స్ఫురించలేదో చెప్పలేకపోతున్నా. ప్రస్తుతం ఈ చట్టం అనాథగా ఉంది. ప్రజల్లో ఎవరో ఒకరు అప్పీలు చేస్తే తప్ప పట్టించుకుంటున్నవారు లేరు. చట్టం అమలుపై పర్యవేక్షణ అధికారాన్ని కమిషన్లకు ఇవ్వాల్సింది. దీనిపై.. నేను తయారుచేసిన పాలనా సంస్కరణల కమిషన్ (ఏఆర్సీ) ప్రథమ నివేదికలో ప్రముఖంగా ప్రస్తావించా. సహ చట్టం స్ఫూర్తిని దెబ్బతీయకుండా నోటిఫికేషన్లతో.. చట్టం వచ్చిన రెండేళ్లలోగా మార్పులు చేయాలని నిర్దిష్టమైన సూచనలు చేశా. ప్రధానికి స్వయంగా వివరించా. అయినా.. వాటిని పక్కనపెట్టేశారు. ఇప్పటికైనా కమిషన్లు బాధ్యత తీసుకుని 4(1)(బి) అమలయ్యేలా చూడాలి.

**(?) ప్రస్తుత రాష్ట్ర సమాచార కమిషన్ అయిదేళ్ల వ్యవధిలో 14వేల అప్పీళ్లు విచారించింది. జరిమానాలు విధించింది మాత్రం 35 సందర్భాల్లోనే. ఎలా దీన్ని అర్థం చేసుకోవాలి**

వాళ్లింకా ప్రభుత్వ అధికారుల్లాగానే పనిచేస్తున్నారు. ప్రజలను కాపాడేందుకే తాము నియుక్తులమయ్యామన్న విషయాన్ని గుర్తించడం లేదు. తమ కట్టుబాటు రాజ్యాంగానికే అన్న విషయాన్ని విస్మరిస్తున్నారు. మిగిలిన రాష్ట్రాల్లో కొద్దిమంది బాగా పనిచేస్తున్నారు. కేంద్ర మాజీ ప్రధాన సమాచార కమిషనర్ హబీబుల్లా బాగా పనిచేశారు.

**(?) రెండో అప్పీళ్లు, ఫిర్యాదులపై విచారణలో మీరు గమనించిన లోపాలు..**

సాంకేతిక కారణాలను సాకుగా చూపి అప్పీళ్లను కొట్టివేస్తున్నారు. దరఖాస్తు చేసుకున్నవారికి సమాచారం ఇప్పించడం తమ మౌలిక విధి అన్న విషయాన్ని మర్చిపోతున్నారు. చట్టంలో భాషే కాదు.. స్ఫూర్తి కూడా స్పష్టంగా ఉంది. వీలైనంత వరకూ సమాచారం ఇవ్వడమే లక్ష్యం. దీన్ని అర్థం చేసుకోకుండా రంధ్రాన్వేషణ చేసేవాళ్లు ఎక్కువయ్యారు. అంబేద్కర్ చెప్పినట్లు ఏ రాజ్యాంగం, చట్టమైనా.. దానిని అమలుచేసేవారి శక్తిసామర్థ్యాలపైనే ఆధారపడి ఉంటుంది. ఎలాంటివారు కమిషనర్లుగా వస్తున్నారు, వారి సామర్థ్యమెంత– సమాజం, పత్రికలు వారికి ఏ మేరకు దిశానిర్దేశం చేయగలుగుతున్నాయి అన్నదానిమీదే చట్టం అమలు ఆధారపడి ఉంది.

**(?) తప్పు చేసిన సమాచార కమిషనర్లను తొలగించడానికి ఎప్పుడో రూపొందించిన అవిశ్వాస విధానాలనే ఇప్పటికీ అమలు చేస్తున్నారు. మారిన పరిస్థితుల్లో ఈ విధానాలు ఎంతమేరకు ఆచరణ సాధ్యం**

124(4) అధికరణతో వచ్చిందిది. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులను తొలగించడానికి దీన్ని పెట్టారు. ఇది కచ్చితంగా విఫలమైంది. దీన్ని తొలగించి జాతీయ జ్యుడీషియల్ కమిషన్ (ఎన్‌జేఏసీ)ని ఏర్పాటు చేయాలి. ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల నియామకాలు, తొలగింపు అధికారాలను దీనికే ఇవ్వాలి. రాష్ట్ర చట్టసభలు, ప్రభుత్వం, ప్రతిపక్షాలు, న్యాయవ్యవస్థ, పౌరసమాజం నుంచి దీని సభ్యులను ఎంపిక చేయాలి. రాజ్యాంగబద్ధ సంస్థలకూ ఇదే పద్ధతిని (నేషనల్ కాన్‌స్టిట్యూషనల్ కమిషన్) వర్తింపచేయాలి. ఈ ఏర్పాటు కోసం జాతీయస్థాయిలో గట్టిగా వాదిస్తున్నవారిలో నేనూ ఉన్నా. జాతీయ సలహా మండలి, లోక్‌సత్తా ఉద్యమాల్లో దీని కోసం గట్టిగా పోరాడుతున్నాం. ఏదో రూపంలో ఈ ఆలోచనలు ఆచరణలోకి వస్తాయని విశ్వసిస్తున్నా.

**(?) సమాచార కమిషన్ల తీర్పులపై సమీక్షించే వ్యవస్థ లేదు. నేరుగా హైకోర్టులకు వెళ్లడమే. సామాన్యులకిది ఖర్చుతో కూడుకున్న విషయం. పరిష్కారమేమిటి**

సమాచార కమిషన్లకు చాలా పెద్ద స్థాయి ఇచ్చాం. వాటికి పైయెత్తున హైకోర్టులు తప్ప ఇతర సంస్థలు ఉండటం సబబు కాదు. గట్టివారిని నియమించి, కమిషన్లను బలోపేతం చేస్తే సరిపోతుంది. కమిషనర్లు కూడా హైదరాబాద్‌లోనే కూర్చోకుండా ప్రాంతాలవారీగా ఉండాలి. గ్రామంలో సమస్య వస్తే రెండో అప్పీలు కోసం హైదరాబాద్ వరకూ రావడం ఇబ్బంది.

**ప్రశ్న: ఇదే మాట రాష్ట్ర కమిషనర్లతో అంటే.. 'ఎవరు రమ్మన్నారు మిమ్మల్ని.. రాకండి', 'ఆన్ ది మెరిట్స్‌పై విచారణ చేసేస్తా'మంటున్నారు..**

**జేపీ:** అంతే చెబుతున్నారు తప్ప ప్రజలకు అందుబాటులో ఉంటామని వారు అనడం లేదు. హైదరాబాద్ సౌకర్యానికి, కారు–ఫోను–ప్యూను పదవులకు అలవాటు పడిపోతున్నారు. ప్రజలకు మంచి చేయాలని మాత్రం అనుకోవట్లేదు. ❍

# జనతెలంగాణ కోసం లోక్‌సత్తా పోరాటం








దాదాపు అరవయ్యేళ్ల ఆకాంక్ష ఫలిస్తూ ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర మూడవ వార్షికోత్సవాన్ని లోక్‌సత్తా పార్టీ ఘనంగా నిర్వహించింది. భౌగోళిక తెలంగాణను జనతెలంగాణగా మార్చే స్పష్టమైన ఎజెండా, రాజకీయ సంస్కృతి లోక్‌సత్తాకు మాత్రమే ఉందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు, ప్రధాన కార్యదర్శి జన్నేపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అమరవీరుల స్థూపం వద్ద నివాళు లర్పించిన అనంతరం.. హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని, లోక్‌సత్తా పార్టీ జెండాని వారు ఎగుర వేశారు. పార్టీ నేతలతో కలిసి తెలంగాణ 'ప్రతిజ్ఞ' చేశారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కన్వీనర్ రాందేశ్‌పాండే, కార్యదర్శి ఎన్.సరోజాదేవి, యువసత్తా రాష్ట్ర అధ్యక్షుడు శివరామకృష్ణ, కో కన్వీనర్ జీఎల్ నరసింహారావు, గంగాభవాని, విమలాదేవి, ప్రసాద్, సాయిప్రీతం తదితరులు పాల్గొన్నారు. ❍

# ఓగేరువాగుపై వంతెన కోసం ప్రయత్నాలు ముమ్మరం




గుంటూరు జిల్లా చిలకలూరిపేట గడియారస్తంభానికి దక్షిణంగా ఉన్న బ్రహ్మంగారి గుడిబజారు నుంచి ఓగేరు వాగుపై వంతెన కోసం చేస్తున్న ప్రయత్నాలను లోక్‌సత్తా ముమ్మరం చేసింది. తాజాగా పట్టణంలోని బందిలిపాలెం పరిసర ప్రాంత ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు మాదాసు భానుప్రసాద్ మాట్లాడుతూ, ఓగేరువాగును ఆనుకొని వేల ఎకరాల సాగుభూమి ఉందని, వంతెన లేకపోవటం వల్ల వ్యవసాయదారులంతా 3 కిలోమీటర్లు చుట్టూతిరిగి వెళ్లాల్సి వస్తోందన్నారు. ఇక్కడ ఇళ్లస్థలాలు కొనుకున్న మధ్యతరగతివారు కూడా వంతెన కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఇప్పటికే అందరు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను కలిసి వివరాలు, వినతిపత్రాలు అందచేశామని, ఆలస్యం చేస్తే ప్రజాఉద్యమాన్ని పెద్దఎత్తున చేపడతామని అన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో సంబంధిత కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు మురికిపూడి ప్రసాద్, కొండలు, వెంకటేశ్వరరెడ్డి, సాదిక్, తిరుమలేశ్వరరావు, శ్రీనివాస్, అన్నారావు, రాము తదితరులు పాల్గొన్నారు. ❍

# సరైన పాలన లేదుగానీ, నవనిర్మాణ దీక్షలా?




ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టిన నవనిర్మాణ దీక్షల వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బందిపడటం, మండుటెండలో విద్యార్థులు నరకం చూడటం తప్పించి రాష్ట్రానికి ఏమీ ఉపయోగం లేదని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. దీక్ష చంద్రబాబు చేస్తుంటే శిక్ష మాత్రం ప్రజలకు పడుతోందన్నారు. విజయనగరంలోని లోక్‌సత్తా కార్యాలయంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో భీశెట్టి మాట్లాడుతూ.. రోజువారీ పాలనను చక్కదిద్దటం చేతగాని చంద్రబాబు నవనిర్మాణ దీక్షలంటూ ఆర్భాటాలు చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని విభజించుకోండని లేఖ ఇచ్చి ఇప్పుడేమో రాష్ట్ర విభజన రోజు చీకటిరోజనటం ప్రజల్ని దగాచేయటమేనన్నారు. రాష్ట్ర విభజనకు అనుకూలంగా వైఖరి తీసుకున్న చంద్రబాబు.. ఏ రకంగా రాష్ట్ర విభజన చేస్తే ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరుగుతుందో ఏరోజూ చెప్పలేదన్నారు. ఇప్పుడు మళ్లీ నవనిర్మాణ దీక్షలంటూ డ్రామాలాడుతున్నారన్నారు. ప్రచారపిచ్చి ముదిరిపోయి ఈవెంట్ మేనేజ్‌మెంట్లతో ముఖ్యమంత్రి కాలక్షేపం చేస్తున్నారన్నారు. తెదేపా నేతల అండతోనే విశాఖలో భూదందా జరుగుతోందని మంత్రి అయ్యన్నపాత్రుడే స్వయంగా చెబుతున్నా ప్రభుత్వం సిగ్గులేకుండా తమ ప్రభుత్వం అద్భుతమంటూ గొప్పలు చెప్పుకుంటోందన్నారు. రాష్ట్రంలో ఎండలు మండి ఎప్పుడూలేనట్టుగా ప్రజలు పిట్టల్లా రాలిపోతుంటే, కనీసం విపత్తు నివారణ చర్యలు తీసుకోవటం కూడా ప్రభుత్వానికి చేతకాలేదన్నారు. విద్యావ్యవస్థను మంత్రులు గంటా, నారాయణలకు తాకట్టుపెట్టారన్నారు. రాష్ట్రాన్ని నెంబర్‌వన్ చేస్తానంటూ ఏపీని అవినీతిలో నెంబర్‌వన్ చేశారన్నారు. ప్రత్యేకహోదా విషయంలో బీజేపీతో కలిసి మోసం చేయటంలో, కొడుకుని మంత్రిని చేసుకోవటంలో, ప్రతిపక్ష పార్టీలవారిని మంత్రులుగా చేయటంలో, ప్రాజెక్టుల్లో దండుకోవటంలో చంద్రబాబు చాలా సాధించారన్నారు. వ్యవస్థల్ని నాశనం చేస్తూ కేంద్రీకృత పాలన చేస్తున్న చంద్రబాబు ప్రభుత్వం కళ్లు తెరవకపోతే తగిన సమయంలో ప్రజలే బుద్ధిచెబుతారన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు సిమ్మ శ్రీను, బోర రమేష్, చందర్రావు, ఎర్నిబాబు, భాస్కర్, అల్లంశెట్టి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. ❍

# పర్యావరణంతో కూడిన అభివృద్ధి కావాలి




పర్యావరణ పరిరక్షణకు సమష్టిగా కృషి చేద్దాం అని భీశెట్టి బాబ్జీ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 105 ఆధ్వర్యంలో విజయనగరం ఉడాకాలనీ గురజాడ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గన్నారు. పర్యావరణంతో కూడిన అభివృద్ధి మన విధానం కావాలన్నారు. మానవ తప్పిదాల వల్ల పంచభూతాలు కాలుష్యానికి గురవుతున్నాయని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డా॥ ఎంవీఆర్ కృష్ణాజీ అన్నారు. క్లబ్ వైస్ ఛైర్మన్ గురుప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలుగునాడు డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షురాలు విమలారాణి, మహిళాక్లబ్ అధ్యక్షురాలు ఎం.సుభద్రాదేవి, దప్పుశ్రీను తదితరులు మాట్లాడారు. ❍

# ఆర్‌టీఎస్ చట్టంపై జాప్యమెందుకు, 'ప్రజలే ప్రభువులు - పాలకులు సేవకులే' అని మరిచారా? -ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లోక్‌సత్తా బహిరంగ లేఖ-

- బండారు రామ్మోహనరావు,
లోక్‌సత్తా 2.0 ఉద్యమ తెలుగు రాష్ట్రాల కన్వీనర్




అశోకుడు చెట్లు నాటించెను, బాటసారుల దాహార్తిని తీర్చడానికి రహదారుల పక్కన బావులు తవ్వించెను.. ఇదీ మనం చిన్నప్పుడు చరిత్ర పాఠాల్లో బాగా వల్లించిన పాఠాలు. అశోకుడి మిగతా పాలనాంశాల గురించి మనకు తెలియకున్నా అశోకుడి గురించి మన మనసుల్లో ముద్ర వేసే వాక్యాలు ఇవి. అలానే చరిత్రలో చాలామంది రాజులు, చక్రవర్తులు వచ్చారు, పోయారు. కొందరు ప్రజాపాలకులుగా, మరికొందరు ప్రజాకంటకులుగా ముద్రవేసుకుని కాలగర్భంలో కలిసిపోయారు. హిట్లర్, ముస్సోలినీ లాంటి నియంతలే ప్రజాగ్రహానికి గురై మరణించారు. రాజు మంచివాడయితే ఫరవాలేదు ప్రజలు క్షేమంగా ఉంటారు. మరి రాజు నియంత అయితే, ప్రజలకు కష్టమే. ప్రజాస్వామ్యంలో దీనికి తావు లేదు.

ప్రజాస్వామ్యంలో.. ఓటు వేసేది ప్రజలే, పన్నులు కట్టేది ప్రజలే, అంతిమంగా ప్రజలే ప్రభువులు – పాలకులు సేవకులే! ఇక్కడ రాచరికానికి తావు లేదు. ఎన్నికైన ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిందే. అందుకే తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావుగారిని లోక్‌సత్తా నిక్కచ్చిగా అడుగుతోంది. ప్రజాప్రయోజనాల్ని, ప్రజావాణిని పట్టించుకుంటారా లేదా అని నిగ్గదీస్తోంది.

రాష్ట్రంలో పౌరసేవల చట్టం (రైట్ టూ సర్వీసెస్– ఆర్‌టీఎస్) తెస్తానని కేసీఆర్ ప్రకటించగానే.. అన్ని రాజకీయ పక్షాలు, ఇతర సంస్థలు ఏమాత్రం పట్టించుకోకున్నా మొదటగా గుర్తించింది లోక్‌సత్తాయే. కేసీఆర్‌ని అభినందిస్తూ లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ మొదట లేఖ రాశారు. ఆర్‌టీఎస్ కోసం 1998 నుంచి కృషి చేస్తున్నందున లోక్‌సత్తా అనుభవాన్ని వినియోగించుకోవాలని, పార్లమెంటరీ కమిటీ విజ్ఞప్తి మేరకు లోక్‌సత్తా రూపొందించిన బిల్లును కూడా రాష్ట్రానికి తగ్గట్టు కొన్ని మార్పులతో జేపీ ముఖ్యమంత్రికి పంపారు.

పూర్వం రాజులకాలంలోలా వాస్తవాలు తెలుసుకోవటానికి ఈవేళ్టి పాలకులు వేగుల మీదే ఆధారపడనక్కర్లేదు. సోషల్ మీడియా సహా రకరకాల మార్గాల్లో అవినీతి వాసనలు మీకు చేరుతూనే ఉంటాయి. గతంలోలా రాజకీయ అవినీతి ఇప్పటివరకూ బైటపడకపోయినా, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిపై కథనాలు సర్వత్రా వినిపిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక గత మూడేళ్లలో రాజకీయ అవినీతి వార్తలు తగ్గాయని, కానీ ప్రజలకు రోజువారీ జీవితంలో పనులు చేయాల్సిన ప్రభుత్వ కార్యాలయాల్లో తగ్గలేదని, ఈ వేధింపులు, అవినీతిని తగ్గించటానికి పౌర సేవల చట్టాన్ని వెంటనే తీసుకురావాల్సిన అవసరం ఉందని నేను కూడా ఓ లేఖ కేసీఆర్‌కి రాశాను. ఈ విషయంలో చొరవ చూపి పౌర సేవల నమూనా చట్టాన్ని తయారుచేయవలసిందిగా నల్సార్ (నేషనల్ లా యూనివర్సిటీ)ని తెలంగాణ ప్రభుత్వం కోరటాన్ని కూడా లోక్‌సత్తా స్వాగతించింది. కానీ ఆ తర్వాత ప్రభుత్వం నుంచి చర్యలు లేవు.

గత రెండు నెలలుగా లోక్‌సత్తా ఆర్‌టీఎస్ ఉద్యమాన్ని ఉధృతం చేసి ప్రజల్లోకి తీసుకెళ్లింది. ఈ చట్టం వస్తే వారి జీవితాల్లో ఎటువంటి మేలి మార్పు వస్తుందో వివరిస్తూ సదస్సులు, రౌండ్‌టేబుల్ సమావేశాలను నిర్వహించింది. ఆ తర్వాత జాతీయ

పౌరసేవల దినోత్సవం ఏప్రిల్ 21 కంటే వారం ముందుగా ఏప్రిల్ 15వ తేదీన ఆర్‌టీఎస్ గురించి సంక్షిప్తంగా వివరించే చిన్న పుస్తకాన్ని ప్రచురించింది. డా॥ జేపీ ఆవిష్కరించిన ఈ బుక్‌లెట్‌ను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తెలంగాణ వ్యాప్తంగా వారంరోజులు కార్యక్రమాలు నిర్వహించింది.

ఏప్రిల్ 21 నుంచి ఆర్‌టీఎస్ కోసం ముఖ్యమంత్రిగారికి పోస్టుకార్డులు రాసే కార్యక్రమాన్ని ప్రారంభించింది. అయినా ఈ చట్టంపై మీ నుంచి స్పందన కనిపించటం లేదు. చట్టం తెస్తానని నెలలు గడుస్తున్నా చర్యలు లేకపోవటం ఏరకమైన సుపరిపాలన అని లోక్‌సత్తా కేసీఆర్‌ని ప్రశ్నిస్తోంది. మీ చిరునామాకు ఒక విలువైన అంశంపై ప్రజలు, పౌరనేతలు రాసిన ఉత్తరాలకు మీరు స్పందించాలా, లేదా? దీనిపై మీరు ప్రజలకు వివరణ ఇవ్వాల్సి ఉంది.

దీంతోపాటే సమాచార కమిషనర్లను వెంటనే నియమించాలని కోరుతున్నాం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కనీసం పదిమంది చొప్పున కమిషనర్లను నియమించాలి. బంగార తెలంగాణ, స్వర్ణాంధ్రప్రదేశ్‌లను సాధించాలంటే.. పాలనలో సమాచార హక్కు చట్టం వంటి ఏర్పాట్లతో పారదర్శకత కీలకం.

లోక్‌సత్తా రూపొందించిన పౌర సేవల బిల్లు పట్ల పౌరసమాజం, ప్రజలు, మేధావులు చాలా సంతృప్తి వ్యక్తం చేశారు. క్రెడిట్ లోక్‌సత్తాకే దక్కుతుందనుకుంటే.. మీరు వేరేవారి చేత కూడా బిల్లును రూపొందించుకోవచ్చు. ఆ చట్టాన్ని తెచ్చిన ఘనత మీకు దక్కితే లోక్‌సత్తాకు ఎటువంటి అభ్యంతరం లేదు. కానీ పటిష్టమైన పౌర సేవల చట్టాన్ని వెంటనే తేవటం తెలంగాణ ప్రజలకు చాలా అవసరం. సమాచార హక్కు చట్టం కంటే కూడా శక్తిమంతమైనది పౌర సేవల హక్కు చట్టం. ఇది తెలంగాణ సుపరిపాలన చరిత్రలో ఒక మైలురాయి అవుతుంది. కాబట్టి వెంటనే ప్రజాప్రయోజనాల్ని గౌరవించి వచ్చే అసెంబ్లీ సమావేశాలలోనే పౌర సేవల చట్టాన్ని తీసుకురావాలని లోక్‌సత్తా కోరుతోంది. ❍

# వాలీబాల్‌లో ఛాంపియన్ క్రీడాకారులవ్వాలి



రాష్ట్రంలోనే విజయనగరం జిల్లాకు క్రీడలలో మంచి పేరుందని, భగవాన్‌దాస్ శిష్యరికంలో వాలీబాల్ క్రీడలో కూడా ఉన్నతస్థాయి క్రీడాకారులు తయారవ్వాలని బాబ్జీ అన్నారు. వాలీబాల్ వేసవి శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏటా జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఈ తరహా శిక్షణను నిర్వహించటం అభినందనీయమని, ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలకు ఇంకా ప్రోత్సాహకాలు ఇవ్వాలని అన్నారు. క్రీడాకారులకు అన్ని శాఖల్లో కోటా ఇస్తే ఇంకా పెద్దసంఖ్యలో వాలీబాల్ ఆటగాళ్లు తయారవుతారని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి టీకేవీ భగవాన్‌దాస్ అన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు చిన్నారి, శివాజీ, శ్రీనివాస్, మూర్తి, పలువురు క్రీడావిద్యార్థులు పాల్గొన్నారు. ❍

# కార్ల అద్దె పెంపుపై హర్షం

ప్రభుత్వ శాఖలకు అద్దె ప్రాతిపదికన తిరుగుతున్న వాహనాలకు జీవో నెంబర్ 87 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అద్దెలు పెంచడంపై ప్రభుత్వ హైర్ వెహికిల్ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ హర్షం వ్యక్తం చేశారు. విజయనగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ.. పెట్రో ధరల పెరుగుదలకనుగుణంగా ఆలస్యంగానైనా చర్యలు తీసుకున్నారన్నారు. కొంతమంది ప్రభుత్వాధికారులే సొంత వాహనాలను అద్దెకు తిప్పుతున్నారని, వారి వివరాల్ని సేకరిస్తామన్నారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు పి.సంతోష్‌కుమార్, సీతారం, రాము, మోహన్, శివ, సాయికుమార్, అప్పన్నబాబు, నాయుడు, రమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ❍

# కార్పొరేటర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయండి



అవినీతిరహిత పాలన, ఇస్తాంబుల్, సింగపూర్‌లను తలపించే మౌలిక వసతులు అని ఊదరగొట్టి చివరకు ఎండ,వానల దయాదాక్షిణ్యాలకు గ్రేటర్ హైదరాబాద్ ప్రజలను తెరాస ప్రభుత్వం వదిలేసిందని లోక్‌సత్తా పార్టీ ధ్వజమెత్తింది. నగరంలో తెరాస కార్పొరేటర్ల వసూళ్ల దందాకు, ఆగడాలకు తక్షణం అడ్డుకట్ట వేయాలని పార్టీ తెలంగాణ అధ్యక్షుడు డా॥ పాండురంగారావు డిమాండ్ చేశారు. చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి.. నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి యజమానిని రూ. 10లక్షలు ఇవ్వాలని బెదిరించటం మరో ఉదాహరణ మాత్రమేనని, సగం జీహెచ్ఎంసీలో ఇలాంటి దందాలే జరుగుతున్నాయని అన్నారు.

గతంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గం తెరాస ఇంఛార్జి, కొందరు కార్పొరేటర్లు సమావేశమై డబ్బులివ్వాలని కాంట్రాక్టర్లను డిమాండ్ చేసిన ఘటనను గుర్తుచేశారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలకే అవినీతి దాడులను పరిమితం చేయకుండా పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తేనే తెలంగాణ ఏర్పాటుకు సార్థకత ఉంటుందన్నారు. మీడియా సమావేశంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జన్నేపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి అల్లేని నిఖిల్ పాల్గొన్నారు.

**వసూల్‌రాజాల భరతం పట్టాల్సిందే**

నగరంలో వసూల్‌రాజాల్లా తయారైన కార్పొరేటర్ల భరతం పట్టాలని లోక్‌సత్తా పార్టీ జీహెచ్ఎంసీ అధ్యక్షుడు దోసపాటి రాము డిమాండ్ చేశారు. కార్పొరేటర్ విఠల్‌రెడ్డి బెదిరించిన ఘటనకు సంబంధించిన ఇంటిని ఆయన పరిశీలించారు. జనం సొమ్ము దండుకుంటున్న కార్పొరేటర్ల భరతం పట్టే కార్యక్రమాన్ని లోక్‌సత్తా చేపడుతుందని, అవినీతిపరుల్ని ప్రజల ముందు నిలబెడతామని అన్నారు. ❍

# ఎల్‌బీనగర్ చౌరాస్తాను ఆధునీకరించాలి



ప్రజలను ట్రాఫిక్ ఇబ్బందుల నుంచి గట్టెక్కించేందుకు ఎల్‌బీనగర్ చౌరాస్తాను ఆధునీకరించాలని జన్నేపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అందుకోసం స్కైవేలు, ఫ్లైఓవర్ ప్రాజెక్టుల ఏర్పాటు ఎంతో అవసరమన్నారు. ఎల్‌బీనగర్, కామినేని, చింతలకుంట జంక్షన్లలో చేపట్టనున్న ప్రాజెక్టులకు ఆయా ప్రాంతాలలోని మహనీయుల విగ్రహాలు అడ్డుగా ఉన్నందున తొలగించి పనులు పూర్తికాగానే యథాస్థానంలో పెడతామని జీహెచ్ఎంసీ ఇచ్చిన హామీకి అంగీకారమేనన్నారు. విగ్రహాలను తరలించే ప్రదేశం ఉత్సవాలకు అందుబాటులో ఉండాలన్నారు. విగ్రహాలను పున:ప్రతిష్టించే ముందు సుందరీకరణ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని మెట్రోరైలు ప్రాజెక్టు తరహాలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చౌరాస్తాను ఆధునీకరించాలని శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ ఈస్ట్ జోన్ కమిషనర్ రఘుప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కో కన్వీనర్ జీఎల్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. ❍

# పురుషోత్తపట్నం ఎత్తిపోతలను అఖిలపక్షంతో పరిశీలించిన లోక్‌సత్తా నేతలు

ఉత్తరాంధ్ర ప్రజల సాగు, తాగు నీటి అవసరాలకు ఎంతో అవసరమైన పురుషోత్తపట్నం ఎత్తిపోతల పనులను అఖిలపక్ష నేతలతో కలిసి పరిశీలించినట్టు లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ తెలిపారు. బాబూ జగ్జీవన్ రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకంలో పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ఎంతో కీలకమైందన్నారు. మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టుల సాధన సమితి అధ్యక్షుడు కొణతాల రామకృష్ణ ఈ బృందానికి నేతృత్వం వహించారు.





శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో రైతులు సాగునీరు లేక, పెద్దసంఖ్యలో ప్రజలు రక్షిత తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నారని, అందరి అవసరాలూ తీరాలంటే సాగునీటి ప్రాజెక్టులు వేగంగా పూర్తి కావాల్సిన అవసరముందని బాబ్జీ మీడియాతో మాట్లాడుతూ అన్నారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఈ ఏడాది ఆగస్టులో విశాఖపట్నానికి నీరు వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారని, అందుకే పనులు జరుగుతున్న తీరుని పరిశీలించామని చెప్పారు. గోదావరి జలాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవటంతోపాటు ప్రాజెక్టు పనులు నాణ్యతా ప్రమాణాలతో ఉండేలా చూడాలన్నది లోక్‌సత్తా విధానమన్నారు. ప్రాజెక్టులో నీరు సరఫరా చేసే విధానం, పైపులైన్ల తీరు, కాంక్రీట్ ఇన్‌టేక్ వెల్ వివరాలు, హెడ్‌స్లూయిజ్ వద్ద నీటినిల్వల పరిస్థితి తదితరాలను పరిశీలించామన్నారు. ద్రోణంరాజు శ్రీనివాస్, స్టాలిన్, శివశంకర్, తోట నగేష్, లోక్‌సత్తా పార్టీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు ముదునూరి రాజ్ వర్మ, కుటుంబరావు తదితరులు కూడా పాల్గొన్నట్టు బాబ్జీ తెలిపారు. ❍

# ఆ భూముల్ని రైతులకు తిరిగి ఇచ్చేయండి



విజయనగరం జిల్లా ఎల్.కోట మండలం జమ్మదేవిపేట, మల్లివీడు రెవెన్యూ పరిధిలో.. కర్మాగారం పేరుతో రైతుల వద్ద భూములు తీసుకుని ఉపాధి కల్పించకుండా అక్రమంగా వేరొకరికి అమ్ముకుంటున్నారని, రోడ్డున పడ్డ రైతులకు ఆ భూముల్ని తిరిగి ఇప్పించాలని భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. 1989-1992 మధ్య కాలంలో కేసీపీ, జీఎస్ఏఎల్ కంపెనీలు ఫ్యాక్టరీ కోసమంటూ నామమాత్రపు ధరకు రైతుల నుంచి 48 ఎకరాలను కొనుగోలు చేశారు. రైతు కుటుంబాలకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇటీవల ఆ భూమిని రైతుల అనుమతి లేకుండా కేసీపీ యాజమాన్యం వేరొకరికి అడ్డగోలుగా అమ్మేసింది. ఈ దగాపై వెంటనే స్పందించి భూముల్ని స్వాధీనం చేసుకుని రైతులకు తిరిగి ఇవ్వాలని రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావుని రైతులతోపాటు కలిసి బాబ్జీ విజ్ఞప్తి చేశారు. యాజమాన్యం పత్తా లేకుండా పోయిందని, జిల్లా అధికారులు వేగంగా స్పందించేలా చేసేందుకు దీనిపై జిల్లా న్యాయసేవా సదన్ (డీఎల్ఎస్ఏ)కి కూడా ఫిర్యాదు చేస్తామని చెప్పారు. జిందాల్ అల్యూమినియం ఫ్యాక్టరీ విషయంలో కూడా ఇలాగే రైతులను మోసం చేశారని, దీనిపై లోకాయుక్త స్థాయి నుంచి లోక్‌సత్తా పోరాటం చేస్తోందని అన్నారు. నాగేశ్వరరావు, సత్యనారాయణ, గోవిందరావు, పాత్రుడు, అప్పారావు, అప్పలనాయుడు తదితర రైతు ప్రతినిధులు ఆర్డీవోను కలిసినవారిలో ఉన్నారు. ❍

## చట్టం సాధించేవరకూ పోస్టుకార్డుల ఉద్యమం





లక్ష్యం సాధించే వరకూ పౌరసేవల చట్టంపై పోస్టు కార్డుల ఉద్యమం కొనసాగుతుందని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జన్నేపల్లి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ హయత్‌నగర్ డివిజన్ భూలక్ష్మీనగర్‌లోని సంక్షేమ సంఘ భవనంలో చట్టంపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పౌరసేవల చట్టం అమలుకు ముఖ్యమంత్రికి కార్డులు రాయటంతోపాటు, నగరంలోని ప్రజలకు కూడా అవగాహన పెంచేందుకు రాస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలతోపాటు కాలనీవాసులు కాశీపతి, మాధవరెడ్డి, శ్రీరాములు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. ❍

## విజయనగరం సమస్యల్ని పరిష్కరించండి



విజయనగరం జిల్లా సమస్యల సుడిగుండంగా, నిరుద్యోగుల కేంద్రంగా మారిందని, కీలక ప్రజాసమస్యలను వెంటనే పరిష్కరించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. మంత్రి సుజయకృష్ణ రంగారావు, జిల్లా కలెక్టర్ వివేక్‌యాదవ్ స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజాఫిర్యాదుల స్వీకరణ వేదికలో పార్టీ కార్యకర్తలతో కలిసి పలు సమస్యలను బాబ్జీ వారి దృష్టికి తీసుకొచ్చారు. విజయనగరానికి ప్రభుత్వ వైద్యకళాశాల మంజూరు, గిరిజన విశ్వవిద్యాలయం పనుల్ని వేగవంతం చేయటం, కీలక శాఖలకు అధికారుల నియామకం, ఝంజావతి ప్రాజెక్టుపై విభేదాలను తొలగించి పనులు ప్రారంభించటం, తారకరామతీర్థను వేగవంతం చేయటం, జ్యూట్ మిల్లును తెరిపించి కార్మికులను తిరిగి తీసుకోవటం, ఇసుకమాఫియాను నియంత్రించటం, చిన్న, మధ్యతరహా పరిశ్రమలతో యువతకు ఉపాధి తదితర అంశాలను బాబ్జీ మంత్రికి వివరించారు. జిల్లాలో వైద్యం, విద్య అధ్వాన్నంగా ఉన్నాయని, ఈ రెండు రంగాలనూ ప్రక్షాళన చేయాలని కోరారు. జిందాల్, కేసీపీ కంపెనీలు ఫ్యాక్టరీల పేరుతో భూములు సేకరించి వేరే వాళ్లకు అమ్ముకుంటున్న వైనాన్ని కూడా ప్రస్తావించి, ఆ భూములను తిరిగి రైతులకు ఇప్పించాలని బాబ్జీ కోరారు. ఈ అంశాలపై దృష్టిసారించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. లోక్‌సత్తా పార్టీ నాయకులు అనంతలక్ష్మి, రాజారావు, శిమ్మశ్రీను, బోర రమేష్, తిప్పాన కోటేశ్వరరావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ❍

## గురజాడపై ఎందుకీ వివక్ష?



భారతజాతి గర్వించదగ్గ మహాకవి గురజాడపై పాలకులు చూపుతున్న వివక్ష కాస్త విజ్ఞత ఉన్నవారందరినీ రగిలిపోయేలా చేస్తోందని బాబ్జీ అన్నారు. గురజాడ ఇంటిని ఆధునీకరించి ప్రజలకు అందుబాటులో ఉంచటంతోపాటు ఆయన వారసులకు ప్రత్యామ్నాయ స్థలాన్ని ఇస్తామన్న హామీపై లోక్‌సత్తా చొరవ వల్లే కదలిక వచ్చింది తప్ప ప్రభుత్వానికి ఏమాత్రం శ్రద్ధ లేదన్నారు. గురజాడ ఇంటిలో మీడియాతో మాట్లాడుతూ.. మహనీయులు, వారి ఆశయాల పట్ల సరైన శ్రద్ధ చూపకుండా వర్ధంతులు, జయంతుల రోజున నీతులు చెప్పి ఉపయోగంలేదని బాబ్జీ అన్నారు. ❍

## అధికార పార్టీ అండతోనే విశాఖ భూస్కాములు



విశాఖపట్నం జిల్లా భూస్కాముల అడ్డాగా మారిందని, దీనిపై హైకోర్టయినా స్పందించి కేసును సుమోటోగా స్వీకరించి ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. వుడా ల్యాండ్‌పూలింగ్ పేరుతో భూ అక్రమాలు పెద్దఎత్తున బహిరంగంగా జరిగినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించలేదన్నారు. వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూముల రికార్డులు తారుమారు చేసి నాయకుల అండతో చెలరేగిపోతున్నారన్నారు. మధురవాడ, కొమ్మాది, మడపాక, భీమిలి, పెందుర్తి తదితర ప్రాంతాలలో భూములు రెవెన్యూ అధికారుల చలవతో భూఆక్రమణదారుల చేతుల్లో చిక్కుకుపోయాయన్నారు. వీటిపై గతంలోనే లోక్‌సత్తా ప్రభుత్వం దృష్టికి తెచ్చినా స్పందన లేదని విశాఖలో మీడియాతో మాట్లాడుతూ బాబ్జీ అన్నారు. అసలు విశాఖలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితిలో ప్రజలున్నారన్నారు. ఉత్తరాంధ్రకు ఏం ఒరగబెట్టారని మహానాడును విశాఖలో నిర్వహించారన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో సగానికిపైగా అధికారులు లేరని, రాష్ట్రంలో 13 జిల్లాలకుగాను 12 జిల్లాలకు విద్యాశాఖాధికారులు లేరని, పైరవీలు తప్ప పాలన లేకుండా రాష్ట్రాన్ని నడిపిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల కోసం కోట్లు పోగేస్తూ ప్రజల కళ్లను వారి వేళ్లతోనే పొడుస్తున్న చంద్రబాబు పాలనపై తన వంతుగా లోక్‌సత్తా నిర్దిష్ట పరిష్కారాలతో ప్రజాచైతన్యం తెస్తుందన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు వేణుగోపాల్, హరిగణేష్, ఎంఎస్ఎన్ మూర్తి, పక్కీ శంకర్, గౌరి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. ❍

## ఉద్యోగ నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేయండి

ముఖ్యమంత్రి, మంత్రులు వందలసార్లు ప్రకటనలిస్తున్నారు తప్ప ఉద్యోగాల భర్తీ కనిపించటంలేదని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ విభాగం డిమాండ్ చేసింది. డీఎస్సీ సహా ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రకటించిన ఇతర ఉద్యోగాల భర్తీకి వెంటనే నోటిఫికేషన్లు జారీ చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి అల్లేని నిఖిల్ అన్నారు. ❍

## పౌరసేవల చట్టం కోసం ముఖ్యమంత్రికి పోస్టుకార్డులు



పౌరసేవల చట్టం (ఆర్‌టీఎస్) వెంటనే తీసుకురావాలని కోరుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పోస్టుకార్డులు రాసే కార్యక్రమాన్ని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు రాందేశ్‌పాండే ఆధ్వర్యంలో హైదరాబాద్ దిల్‌షుక్‌నగర్‌లో నిర్వహించారు. ఆర్‌టీఎస్ తేవాలంటూ పౌరులు సంతకాలు చేసిన పోస్టుకార్డులను ముఖ్యమంత్రికి పంపుతామని నేతలు తెలిపారు. ఈ చట్టం వస్తే ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు కచ్చితంగా నిర్ణీత కాలవ్యవధిలో జరుగుతాయని, గడువులోగా పనిచేసిపెట్టకపోతే ప్రజలకు ప్రభుత్వం రోజుకు కనీసం రూ.250 పరిహారం చెల్లిస్తుందని, ఇంత శక్తిమంతమైనది కాబట్టే ఈ చట్టాన్ని తెలంగాణ ప్రభుత్వం వెంటనే తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా నాయకులు సూర్యప్రకాష్ గడాలే, చంద్రమౌళి, ప్రశాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు. ❍

# విద్యను నాశనం చేస్తున్నది ప్రభుత్వాలే: జేపీ

సమాజం విద్యను కోరుతోంది,

తల్లిదండ్రులు త్యాగాలు చేస్తున్నారు,

పిల్లలు కష్టపడుతున్నారు..

అయినా మనదేశం విద్యారంగంలో వెనకబడి ఉంది.

దీనికి కారణం ప్రభుత్వాల నిస్సిగ్గు పాలనే

అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో ప్యూర్ (పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఎడ్యుకేషన్) సంస్థ ఆధ్వర్యంలో ప్యూర్ గురు పేరుతో ఆత్మీయ సమ్మేళనం జరిగింది.

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జేపీ మాట్లాడుతూ, భారతదేశంలోని పిల్లలు గొప్ప మేధాశక్తి కలవారని, అయితే సరైన ప్రోత్సాహం లేక వెలుగులోకి రావటం లేదన్నారు. విద్యాహక్కు చట్టం పేరిట విద్యను నాశనం చేశారని, చట్టం వచ్చిన తరువాత ప్రభుత్వ పాఠశాలల్లో 11శాతం పిల్లలు తగ్గారన్నారు. సమసమాజాన్ని స్థాపించే విద్య అవసరమన్నారు. తెలుగు రాష్ట్రాల్లో చదువు కోసం దాదాపు రూ.31,000 కోట్లు ఖర్చు చేస్తున్నా.. పరిస్థితులను గమనిస్తే ఆ నిధులు దారితప్పుతున్నాయా అనే అనుమానం కలుగకమానదన్నారు.

గౌరవ అతిథిగా హాజరైన ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, దేశం బాగుపడాలంటే ఉత్తమ నాగరికుల అవసరం ఉంటుందని, అలాంటివారిని తయారుచేసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. అంబేద్కర్, ఫూలే, కలాం వంటి పేదలంతా మంచి చదువుతోనే ఎదిగారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపర్చడంతోపాటు బోధనాపద్ధతుల్లో సమూల మార్పులను చేయగలిగితే మంచి ఫలితాలు వస్తాయన్నారు.

కార్యక్రమంలో సంస్థ ఎండీ సంధ్య గొల్లమూడి తాము చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్యూర్ ఛైర్మన్ విజయరామిరెడ్డి, సుజాత, హరి, వేణుగోపాల్, మహ్మద్ సర్దార్ తదితరులు పాల్గొని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులను సత్కరించారు. సభకు ముందు డాక్టర్ స్వరూప గజల్ పాడగా, సతీష్ పేరిణి నృత్యాన్ని ప్రదర్శించారు. ❍

# రైతులు, యువతకు అండగా లోక్‌సత్తా పార్టీ

రైతులు, యువతకు లోక్‌సత్తా పార్టీ అండగా నిలుస్తుందని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. విజయనగరం జిల్లా ఎస్.కోటలో జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడుతూ, నాడు కాంగ్రెస్‌వారు, ఇప్పుడు తెదేపావారు వ్యవసాయ వ్యతిరేక విధానాలతో రైతుకు ఆదాయం, యువతకు ఉపాధి రాకుండా చేస్తున్నారన్నారు. జిందాల్ వంటి కంపెనీలవారు రైతుల నుంచి కారుచౌకగా పొలాల్ని తీసుకుని పరిశ్రమలు పెట్టకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటున్నారన్నారు. రైతులకు అన్యాయం జరిగిందని తెలిసినా ఎమ్మెల్యేలు, మంత్రులు పట్టించుకోవటం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలు, జ్యూట్ పరిశ్రమలు మూతపడి వేలాది మంది రోడ్డున పడినా ముఖ్యమంత్రి స్పందన లేదన్నారు. ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటుతోపాటు రైతులకు ఆదాయం పెంచే విధానాలతో లోక్‌సత్తా పార్టీ రైతులకు అండగా నిలుస్తుందన్నారు. జమ్మాదేవిపేట రైతు నేత నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు రైతులు ఈ సందర్భంగా లోక్‌సత్తా పార్టీలో చేరారు. వీరికి కండువా కప్పి బాబ్జీ ఆహ్వానించారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు కాండ్రేగుల ప్రసాద్, పద్మాకర్, రామలక్ష్మి, శ్రీదేవి, కృష్ణారావు, కె.వి శర్మ, శ్రీను,







అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ❍



# జేపీ, ఎఫ్‌డీఆర్ టీంతో రోణంకి గోపాలకృష్ణ భేటీ

అనేక అవరోధాల మధ్య సివిల్ సర్వీస్ పరీక్షలో టాపర్‌గా గెలిచి యువతకు స్ఫూర్తిగా నిలిచిన రోణంకి గోపాలకృష్ణ తనకు స్ఫూర్తినిచ్చిన లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) ప్రధాన కార్యదర్శి డా॥ జయప్రకాష్ నారాయణ్‌ను ఇటీవల హైదరాబాద్‌లో కలుసుకున్నారు. శిక్షణ, వృత్తికి సంబంధించి పలు సూచనల్ని అడిగి తెలుసుకున్నారు. జేపీ మార్గదర్శకత్వం తనలాంటివారికి నిరంతరం అవసరమన్నారు. గోపాలకృష్ణ తండ్రి అప్పారావు కూడా జేపీతో సమావేశం పట్ల ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. దేశం పట్ల తన విజన్, ఐఏఎస్‌కు ఎంపికవటానికి ప్రిపరేషన్ తదితర అంశాలను ఈ సందర్భంగా గోపాలకృష్ణ ఎఫ్‌డీఆర్ ఇంటెర్న్స్‌తో పంచుకున్నారు.



Posting Date 22-06-2017
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on June16th, 2017



# బ్లాక్ మెయిల్ నిరాహార దీక్షలు చేయలేదు

నిరాహార దీక్ష బ్రిటీష్ పాలన నాటి అవశేషమని , ఇకపై రాజ్యాంగ పద్ధతుల్లో స్వదేశీ నేతలపై పోరాడాలని రాజ్యాంగ రచన సమయంలో అంబేద్కర్ సూచించారు. కానీ ఇప్పటికీ దీన్ని ఒక అసాధారణ నిరసన కార్యక్రమంగా బ్లాక్ మెయిలింగ్ ఎత్తుగడగా చాలామంది అనుసరిస్తున్నారు .

## నిజాలు మాట్లాడుకుందాం-22

షేర్ చేయండి . ప్రజలకు నిజాలు చేరవేయండి

| Book-Post<br>PRINTED MATTER | To |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad